మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 5-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 306 Issue: 306

Circulated to Telangana
Published from Jagitial

05 మే 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:52 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి చవితి ఉ. 7:51ం వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం జ్యేష్ఠ మ. 12:47 వరకు తరువాత మూల యోగం శివ రా. 12:09ం వరకు కరణం బవ సా. 6:38 వరకు బాలవ ఉ. 7:52ం వరకు వర్జ్యం రా. 9:54 నుండి రా. 11:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:24 నుండి ఉ. 9:15 వరకు రా. 11:04 నుండి రా. 11:49 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:58 వరకు యమగండం ఉ. 9:02 నుండి ఉ. 10:37 వరకు గుళికాకాలం మ. 12:12 నుండి మ. 1:48 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:16 నుండి తె. 5:04 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## ప్రజా తీర్పు

| తమిళనాడు | | బెంగాల్ | | కేరళం | | పుదుచ్చేరి | | అస్సాం | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| టీవీకే | 107 | బీజేపీ | 207 | యూడీఎఫ్ | 97 | ఎన్డీయే | 18 | బీజేపీ | 102 |
| డీఎంకే | 74 | టీఎంసీ | 80 | ఎల్డీఎఫ్ | 35 | కాంగ్రెస్ | 6 | కాంగ్రెస్ | 21 |
| అన్నాడీఎంకే | 53 | కాంగ్రెస్ | 2 | ఎన్డీయే | 3 | టీవీకే | 3 | ఏఐయూడీఎఫ్ | 2 |
| ఇతరులు | 0 | ఇతరులు | 4 | ఇతరులు | 5 | ఇతరులు | 3 | ఇతరులు | 1 |



# బీజేపీ బెంగాల్ టైగర్

## కాషాయ పార్టీ అఖండ విజయం

### 208 సీట్లతో అధికారం కైవసం.. ఓడిపోయిన సీఎం మమత బెనర్జీ



బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రక విజయాన్ని సాధించింది. తొలిసారిగా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. 294 స్థానాలున్న అసెంబ్లీలో (ఒక స్థానానికి పోలింగ్ వాయిదా పడటంతో 293 స్థానాలకు లెక్కింపు జరిగింది). ఈ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 207 సీట్లను కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని ఘనంగా చాటింది. మొత్తం 294 స్థానాలు కాగా, మెజారిటీ మార్క్ 148 సీట్లు దక్కాలి. అయితే, బీజేపీ అంతకుమించి సాధించడంతో బెంగాల్ గడ్డపై కాషాయ జెండా రెపరెడలాడబోతోంది.

కోల్‌కతా: మమత బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ 80 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ రెండు చోట్ల గెలవగా, వామపక్షాలు రెండుచోట్ల విజయం సాధించాయి. బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ రికార్డు స్థాయిలో దాదాపు 48% ఓట్ల షేర్ సాధించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించిన సువేందు అధికారి, అత్యంత ప్రతిష్టాత్మకమైన భవానీపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై 15,000 ఓట్ల పైచిలుకు మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఆయన నందిగ్రామ్‌లో కూడా తన ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నారు. తన కంచుకోటగా భావించే భవానీపూర్‌లో మమత పరాజయం పాలయ్యారు. కాంగ్రెస్ కీలక నేత అధిర్ రంజన్ చౌదరి బహరంపూర్‌లో ఓటమి చెందారు.బెంగాల్‌లో -2 వ పేజీలో...

# జననాయగన్

## తమిళనాడు విజయ్ దళపతిదే.. బ్రహ్మారథం పట్టిన తమిళ ప్రజలు

**107 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరణ**

- భారీ విజయం అందించిన తంబీలు
- రెండో స్థానానికి పడిపోయిన డీఎంకే
- సీఎం స్టాలిన్ ఘోర పరాజయం
- తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై కూడా



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) సంచలన విజయం సాధించింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని చెరిపివేస్తూ, టీవీకే 107 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఎటువంటి పొత్తులు లేకుండా బరిలోకి దిగిన విజయ్ పార్టీ 107 స్థానాలను కైవసం చేసుకుంది. అయితే, 234 సీట్లున్న అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ (118)కు టీవీకే 11 సీట్ల తరువాయి 2 వ పేజీలో...



## బంగారం- వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.15,044 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,902 |

# కేరళలో యూడీఎఫ్ పాగా

## ఎల్డీఎఫ్ కూటమి దారుణ ఓటమి.. ముఖ్యమంత్రి పదవికి విజయన్ రాజీనామా



కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో పదేళ్ల వామపక్ష పాలనకు తెరపడింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) చారిత్రాత్మక విజయం సాధించింది. పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) ప్రభుత్వంపై ప్రజలు స్పష్టమైన వ్యతిరేక తీర్పు ఇచ్చారు. ఈ ఫలితంతో దేశంలో కమ్యూనిస్టుల పాలనలో ఉన్న చివరి రాష్ట్రం కూడా వారి చేజారినట్లయింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ప్రభుత్వం ఏర్పాటుకు 71 సీట్లు అవసరం కాగా, యూడీఎఫ్ కూటమి 102 స్థానాలతో తిరుగులేని విజయం అందుకుంది. మరోవైపు, అధికార ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలతో సరిపెట్టుకుంది.

తిరువనంతపురం: ఎన్డీయే కూటమి 3 చోట్ల గెలిచి ఉనికిని చాటుకుంది. ఏప్రిల్ 9న ఎన్నికలు జరగగా, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలే ఎల్డీఎఫ్ ఓటమికి ప్రధాన కారణాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విజయంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ.. ఎల్డీఎఫ్ ప్రభుత్వ అహంకారం, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు ఇదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ.. తాము ఊహించిన దానికంటే గొప్ప విజయం లభించిందని అన్నారు. ఫలితాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు యూడీఎఫ్ సన్నాహాలు చేస్తోంది.

### పుదుచ్చేరి, అస్సాంలో ఎన్డీయే

పుదుచ్చేరి, అస్సాంలో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించింది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్డీయే వరుసగా రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. 30 సీట్లు ఉన్న అసెంబ్లీలో మెజారిటీ మార్కు (16) దాటి ఎన్డీయే విజయం సాధించింది. ఏఐఎన్ఆర్‌సీ అధినేత ఎన్ రంగసామి -2 వ పేజీలో...



# చారిత్రక విజయమిది

## ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది

- 2026 ఎప్పటికీ గుర్తుండిపోతుంది.. కార్యకర్తలదే ఈ గెలుపు
- బెంగాల్ ప్రజలకు శిరస్సు వంచి వందనాలు
- టీవీకే అధినేత విజయ్‌కు కంగ్రాట్స్: ప్రధాని మోదీ

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ విజయం చారిత్రాత్మకమని మోదీ అన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ మూడింట విజయం సాధించింది. అసోం, పుదుచ్చేరిలో బీజేపీ కూటమి గెలిచింది. వీటితోపాటు పశ్చిమ బెంగాల్‌లో గెలవడం బీజేపీకి భారీ ప్రోత్సాహాన్నిచ్చింది. ఈ విజయంపై మోదీ స్పందించారు.

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించిందని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 2026 ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, అసోం ప్రజలు మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించారని మోదీ అన్నారు. తమిళనాడులో టీవీకే అద్భుత విజయం సాధించిందని ప్రశంసించారు. తమిళనాడు ప్రజల సంక్షేమం, ప్రగతికి కేంద్రం సాయం అందిస్తుందని మోదీ తెలిపారు. బెంగాల్‌లో సాధించిన విజయం.. ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలు సాగించిన పోరాటానికి ఫలితం అన్నారు. కార్యకర్తలు లేకుంటే విజయం సాధ్యమయ్యేది -2 వ పేజీలో...

## విశ్వవాణి



1986లో ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ అణు విద్యుత్తు కేంద్రంలో రియాక్టర్ పేలి రేడియేషన్ ప్రభావంతో వేల మంది చనిపోయారు. ఆ ప్రాంతంలో 30 కిలోమీటర్ల మేర నిషేధిత ప్రాంతంగా, నివాసానికి యోగ్యంగాలేని ప్రాంతంగా గుర్తించారు. అయితే, వానపాములు మాత్రం ఆ రేడియేషన్‌ను తట్టుకొని జీవించాయి. వాటి డీఎన్ఏ ఏ మాత్రం ప్రభావితం కాలేదు. అందుకే వానపాములు ఎలాంటి నేలనైనా సారవంతం చేయగలదని అనేది.



# భూములకు రెక్కలు!

- ధరల సవరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- విద్యుత్ కేసులు సీబీఐకి అప్పగింత
- మున్సిపల్ బకాయిలపై ఓటీఎస్ అమలు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

# నేరాల్లో బీహార్‌లా తెలంగాణ

## రాష్ట్రంలో క్షీణించిన రక్షణ వ్యవస్థ

### లోపించిన పోలీశ్ శాఖ పటిష్టత.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా పట్టుతప్పాయని, రాష్ట్రం బీహార్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల మాదిరిగా మారిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రక్షణ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని, పోలీసు శాఖ పటిష్టత లోపించిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

5.5.2026

మేషం: సన్నిహితులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానం అందుకుంటారు. వ్యాపార వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఇంటా బయట మరింత ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది.

వృషభం: కీలక నిర్ణయాలలో సన్నిహితుల సలహా తీసుకొని ముందుకు సాగడం మంచిది. చేపట్టిన పనుల్లో చికాకులు పెరుగుతాయి. సోదరుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అవసరానికి తగిన సహాయం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు తెలివిగా పరిష్కరించుకుంటారు.

మిథునం: కుటుంబ సభ్యులతో స్వల్ప మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో సొంత ఆలోచనలు చేయడం మంచిది కాదు. ఇంటాబయట బాధ్యతలు చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహకర వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: కుటుంబ సమస్యలు మరింత నిరాశ కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా సాగవు. ముఖ్యమైన పనులలో ప్రతిబంధకాలు తప్పవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. నూతన ప్రయత్నాలు అంతగా కలిసిరావు.

సింహం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: ఇతరులతో వివాదాలకు వెళ్లకపోవడం మంచిది. కుటుంబ సభ్యులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి మరింత నిరాశ కలిగిస్తుంది. చేపట్టిన పనులు శ్రమతో కొన్ని పూర్తవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. నూతన వాహన యోగం ఉన్నది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. సన్నిహితుల నుంచి వివాదాలపై కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగ విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

వృశ్చికం: ఇంటాబయట పని ఒత్తిడి అధికమై సమయానికి నిద్రాహారాలు ఉండవు. బంధువులతో ఊహించని విభేదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితులు కొంత మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలు ఇబ్బంది కలిగిస్తాయి. నిరుద్యోగులు అధిక శ్రమతో అల్ప ఫలితాలు పొందుతారు.

ధనస్సు: ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు జాప్యం అయినప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. దైవదర్శనాలు చేసుకుంటారు. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగుతాయి. అధికారులతో చర్చలు ఫలిస్తాయి.

మకరం: నిరుద్యోగుల యత్నాలు ఓ కొలిక్కి వస్తాయి. సోదరుల నుండి అవసరానికి ధన సహాయం లభిస్తుంది. చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపార, ఉద్యోగాలు సాఫీగా సాగుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

కుంభం: కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో సొంత ఆలోచనలు చెయ్యటం మంచిది కాదు. చేపట్టిన పనులలో తొందరపాటు మంచిది కాదు. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరిగి విశ్రాంతి ఉండదు. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు.

మీనం: కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలలో శ్రమాధిక్యత కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి కొంత మందకొడిగా సాగుతుంది. ధన వ్యవహారాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహకర వాతావరణం ఉంటుంది.




# ధరల సవరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

**విద్యుత్ కేసులు సీబీఐకి అప్పగింత**
**మున్సిపల్ బకాయిలపై ఓటీఎస్ అమలు**
**రైతులకు అకాల వర్షాల సహాయం**
**తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు**

హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై నిష్పాక్షిక విచారణ కోసం ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ, మున్సిపల్ పన్నుల బకాయిలపై వన్ టైమ్ సెటిల్మెంట్, రైతులకు అకాల వర్షాల సహాయం ఇంకా ఐటీఐలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వంటి కీలక అంశాలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది.

1. విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిషన్ను ఏర్పాటు చేసింది. 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఇన్క్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి. లోకూర్ను కమిషన్గా నియమించారు. 2024 అక్టోబర్లో కమిషన్ మొత్తం 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అనంతరం 2025 జనవరి 4వ తేదీన జరిగిన కేబినేట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ ఈ రోజు కేబినేట్ చర్చించింది. ప్రధానంగా అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఈ కేసులో ఉన్నాయి. అందుకే నిష్పాక్షిక దర్యాప్తు జరిపేందుకు సీబీఐ విచారణ అప్పగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

2. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వస్తాయి. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉన్నారు. ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తున్నారు. దీంతో పాటు వాస్తవంగా మార్కెట్ లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన భూముల ధరలు భారీగా వ్యత్యాసమున్నాయి. అందుకు శాస్త్రీయ పద్ధతి అనుసరించి ఈ ధరలను సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిల్లాల్లో ఉండే మార్కెట్ విలువల రివిజన్ కమిటీలు అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని విలువలను సవరిస్తుంది.

3. హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భూముల ధరలు పెరిగేలోపు దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా పది శాతం చెల్లించే వెసులుబాటు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. వారికి ఇప్పుడున్న భూముల ధరలే వర్తిస్తాయి. మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది.

4. నిన్న అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం అందింది. వెంటనే ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని వివరాలు తెప్పించుకుని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

5. నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ- రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీడీబీ నిర్వహిస్తుంది.

6. తెలంగాణలో 9 జిల్లాల్లో 33/11 కేవీ సబ్స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. పైలెట్ పద్ధతిన 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది.

7. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పన్నులను క్లియర్ చేరుకునేందుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 5864 కోట్ల బకాయిలున్నాయి.

జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించి వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ.1686 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోనే వన్ టైమ్ సెటిల్మెంట్ పై ఈ బకాయిలు వసూలు చేసుకోవాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది. హైదరాబాద్ జల మండలికి ఇవ్వాల్సిన నీటి బకాయిలను కూడా సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

8. ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నారు.

9. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు (అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్లు), పాలిటెక్నిక్లు, టీ శాట్ ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చి, ఒకే గొడుగు కింద ఉంచాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

10. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం తెలిపింది.

# బీజేపీ బెంగాల్ టైగర్

**మొదటి పేజీ తరువాయి**

అధికారాన్ని ఛేజిక్కించుకోవడం ఏళ్లుగా నిరీక్షించిన బీజేపీ కల సాకారమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు సమాయత్తమవుతోంది. అయితే.. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది. అందుకు కారణం.. ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ మాదిరిగా బీజేపీ సీఎం అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు వెళ్లలేదు. ప్రధాని నరేంద్ర మోదీ అన్నీతానై వ్యవహరిస్తూ మమతా బెనర్జీ పాలనకు చరమగీతం పాడారు. దాంతో.. ముఖ్యమంత్రిగా సీనియర్లకు అవకాశమిస్తారా? లేదా బెంగాలీవాసికే పట్టం కడుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

సీఎం పదవికి పోటీదారులుగా మహాభారత్ సిరీస్లో ద్రౌపది పాత్రతో సుపరిచితమైన నటి రూపా గంగూలీ, మహిళా నాయకురాలు అగ్నిమిత్ర పాల్, సీనియర్ నాయకుడు సువెందు అధికారి, రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య ఉన్నారు. వీరితో పాటు నిశిత్ ప్రమాణిక్, ప్రజాదారణ కలిగిన దిలీప్ ఘోష్ సీఎం కుర్చీని ఆశిస్తున్నారు. ఈ ఆరుగురిలో ఎవరిని బీజేపీ తమ తొలి ముఖ్యమంత్రిని చేస్తుంది? అనేది రెండు మూడు రోజుల్లో స్పష్టత రానుంది. ఎన్నికల ప్రచారం వేళ హోంమంత్రి అమిత్ షా బీజేపీకి ఓటేస్తే.. బెంగాలీని సీఎం చేస్తాం అని హామీ ఇచ్చారు. దాంతో.. షా మాట ఇచ్చినట్టు బెంగాలీవాసికి పట్టాభిషేకం చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది. కేంద్రమంత్రి సుకంతా ముజుందార్ మాట్లాడుతూ.. మాంసాహారం తినే వ్యక్తి తదుపరి బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతారు అని బీజేపీ గెలిస్తే మాంసం, చేపలు తిననివ్వరు అని ఎన్నికల సందర్భంగా ప్రజలను భయపెట్టిన మమతకు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో సోనాపూర్ దక్షిణ నియోజక వర్గం నుంచి రూపా గంగూలీ, అసాన్సోల్ సీటు నుంచి అగ్నిమిత్ర, నందిగ్రామ్ నుంచి సువెందు, ఖరగ్పూర్ సదర్ నుంచి దిలీప్ ఘోష్ గెలుపొందారు. ఈ నలుగురూ బెంగాలీలే కావడంతో.. ఈ చతుష్టయంలో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని విశ్లేషకులు అంటున్నారు.

# నేరాల్లో బీహార్‌లా తెలంగాణ



సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదని, శాంతిభద్రతలను కాపాడే రక్షణ వ్యవస్థ కుదేలైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉండేదని, నేరస్థులు చట్టానికి భయపడే వారని అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణలో శాంతి భద్రతలు పట్టు తప్పాయి. సీసీ కెమెరాలు పని చేయడం లేదు, రక్షణ వ్యవస్థ క్షీణించింది. రాష్ట్రంలో తుపాకులతో కాల్పులు జరుగుతుంటే.. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఏం చేస్తోంది. కరీంనగర్‌లో పట్టపగలు దాడులు జరిగినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. బాధితులను పరామర్శించడానికి కూడా ఎవరూ రాలేదు. దోచుకో, దాచుకో అన్నట్లుగా రాష్ట్రంలో నేరస్థులకు ప్రభుత్వం ఫ్రీ హ్యాండ్ ఇచ్చిందా?. కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నట్లే.. దొంగలను కూడా దోచుకోమంటున్నారా? ప్రతిపక్షాలను అరెస్ట్ చేయడంపై ఉన్న శ్రద్ధ, ప్రజలను కాపాడడంలో లేదా? శాంతిభద్రతలను గాడిలో పెట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నేరాల నియంత్రణపై తక్షణమే దృష్టి సారించాలి' అని అన్నారు.

### ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీయండి

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడూ సమయానికి రైతుబంధు వేయలేదని విమర్శించారు. రైతులకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా గోస పుచ్చుకుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు సమయానికి రైతుబంధు వేసిన చరిత్ర కేసీఆర్‌ది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా అన్నదాతలను వేధిస్తోందని అన్నారు. ఆంక్షలు లేకుండా పంటలు కొన్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరి, జొన్నలు, శనగ పంటలకు మద్దతు ధర ఇవ్వడం లేదని తెలిపారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ కదం తొక్కుతుందని పేర్కొన్నారు. రాబోయే వారం రోజుల పాటు కొనుగోలు కేంద్రాలను పరిశీలిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన తెలియజేయాలన్నారు. తహశీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీద్దామని అన్నారు.

# జననాయగన్

**మొదటి పేజీ తరువాయి**

దూరంలో నిలిచింది. పెరంబూర్ నియోజకవర్గం నుంచి విజయ్ 53,715 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. అలాగే ఆయన పోటీ చేసిన మరో స్థానం తిరుచ్చి ఈస్ట్‌లో కూడా గెలుపొందారు. అయితే, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సొంత నియోజకవర్గమైన కొలత్తూరులో టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో అనూహ్యంగా ఓడిపోయారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ లేకపోవడంతో, టీవీకే ఇతర చిన్న పార్టీల లేదా స్వతంత్రుల మద్దతు కూడగట్టే అవకాశం ఉంది. కాంగ్రెస్ వంటి పార్టీల మద్దతు కోసం చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ పార్టీ సాధించిన ఈ విజయం తమిళ రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలికిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఏఐఏడీఎంకేతో పొత్తు ?:** గతంలో టీవీకే-ఏఐఏడీఎంకే మధ్య పొత్తు చర్చలు విఫలమయ్యాయి. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఏఐఏడీఎంకే తన రాజకీయ భవిష్యత్తును నిలబెట్టుకోవడానికి టీవీకేతో కలిసే అవకాశం ఉంది. అయితే, విజయ్ బీజేపీని ఆదర్శ శత్రువుగా పేర్కొన్నందున, ఏఐఏడీఎంకే బీజేపీని దూరం పెట్టాలని అడగవచ్చు.

చిన్న పార్టీలతో పొత్తు ?

డీఎంకే లేదా ఏఐఏడీఎంకేతో పొత్తు లేకుండా, పీఎంకే, డీఎండీఎకే, వీసీకే, ఎంఎంఎంకే వంటి చిన్న పార్టీలతో చర్చలు జరిపే అవకాశం ఉంది. ఇలా చేస్తే, విజయ్ తన స్వంత రాజకీయ వారసత్వాన్ని నిర్మించుకునే అవకాశం ఉంటుంది.

**కాంగ్రెస్ మద్దతు?:** స్థానిక పార్టీలను పక్కన పెట్టి, కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. కాంగ్రెస్ ఇప్పటికే టీవీకేకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.

**స్వతంత్రుల మద్దతు?:** స్వతంత్ర అభ్యర్థుల మద్దతు పొందడం ద్వారా కూడా విజయ్ మెజారిటీ సాధించే అవకాశం ఉంది.

# చారిత్రక విజయమిది

**మొదటి పేజీ తరువాయి**

కాదని చెప్పారు. బెంగాల్ ప్రజల కోసం, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడం కోసం బీజేపీ అన్నివిధాలుగా తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ప్రశంసించారు. బెంగాల్‌లో ప్రజాశక్తి నిలబడిందని, బీజేపీ రాజకీయాలు మంచి పాలనకు నాంది అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని తెలిపారు. అసోంలో బీజేపీ కూటమి సాధించిన విజయం.. అక్కడి ప్రజల అభివృద్ధికి, జీవితాల్లో మార్పు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనమని వివరించారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్ కూటమికి కూడా ప్రధాని అభినందనలు తెలిపారు. వికసిత్ కేరళ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిలో కూడా ఎన్.రంగస్వామి ఆధ్వర్యంలోని బీజేపీ కూటమి విజయం సాధించడంపై కూడా మోదీ హర్షం వ్యక్తం చేశారు. తమ పనితీరు ఆధారంగా ప్రజలు మరోసారి అధికారాన్ని అందించారని పేర్కొన్నారు.

# కేరళలో యూడీఎఫ్ పాగా

**మొదటి పేజీ తరువాయి**

వరుసగా ఐదోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించబోతున్నారు. ఆయన తాను పోటీ చేసిన రెండు స్థానాలైన తట్టంచవాడి, మంగళంలలో గెలుపొందారు. ఇక, అస్సాంలో కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి స్పష్టమైన మెజారిటీతో విజయం సాధించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీలు, రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, స్థిరమైన పాలన ఎన్డీయే విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ విజయం ద్వారా అస్సాంలో బీజేపీ తన పట్టును మరింత బలోపేతం చేసుకుంది.

## కేరళం గెలుపుపై రేవంత్ ట్వీట్

హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాను కేరళలో ప్రచారం చేసిన ఫొటోలను కూడా పంచుకున్నారు. కేరళలో యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇందుకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారకులు అంటూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, వేణుగోపాల్, దీపాదాస్ మున్షీలకు కూడా అభినందనలు తెలిపారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎంతోమంది యూడీఎఫ్ మద్దతుదారులు, కేరళ ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపించారని గుర్తు చేసుకుని రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి అధికంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా అభివృద్ధిని విశ్వసిస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా దశాబ్ద కాలం పాటు అన్యాయాన్ని ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికాయని అన్నారు. కేరళలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రగతిశీల పాలన, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. యూడీఎఫ్‌ను కేరళ ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు.

## దేశానికి తమిళ ప్రజలు కొత్త సంకేతం: కవిత

హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవిత స్పందించారు. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి కొత్త రాజకీయ శక్తులు అవసరమని తమిళ ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఉన్న వాళ్లతో విసిగిపోయాం. అధికార దాహార్తులతో వేసారిపోయాం. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి 'కొత్త రాజకీయ శక్తులు' అవసరమని దేశానికి తమిళ ప్రజలు ఒక సంకేతం పంపారు" అని ట్వీట్ చేశారు. కవిత కూడా పది రోజుల క్రితం తన కొత్త పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ శక్తుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని అభిప్రాయపడ్డారు.

# పాలమూరు నుంచే కవిత తొలి అడుగు

**కృష్ణా జలాల్లో అన్యాయంపై గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి**

**8న చౌదరిగూడెం వద్ద పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ**

**పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు**




హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత ఆ పార్టీ అధినేత్రి, ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన కల్వకుంట్ల కవిత అన్నట్టుగానే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తన మొదటి ప్రాధాన్యతగా కృష్ణా జలాల సాధనకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8న చౌదరిగూడెం వద్ద "పాలమూరు – – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచిన తర్వాత కూడా 50 పనులు పూర్తి చేయకపోవడంపై "జనంబాట" కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగంగా పూర్తి చేయించడానికి ఉద్యమ ప్రణాళిక ప్రకటించే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని మన బీడు భూములకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**"పాలమూరు రంగారెడ్డి సాధన సభ" పోస్టర్ ఆవిష్కరణ**

పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టులో రంగారెడ్డి జిల్లాకు నీళ్లు ఇచ్చే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సహా మూడు ప్యాకేజీల పనులను 11 ఏళ్ల తర్వాత కూడా ప్రారంభించకపోవడంపై ఉద్యమానికి కవిత శ్రీకారం చుట్టారు. ఈనెల 8న కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరి గూడెం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సాధన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్, సీమ రమేశ్, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వేరోళ్ల పెళ్లికి ఇంకెన్ని రోజులు డ్యాన్స్?

### తెలంగాణ బీజేపీ నేతలపై రాజాసింగ్ ఫైర్

**రాష్ట్రంలో ఎప్పుడు అధికారంలోకి వస్తారని ప్రశ్న**

గోషామహల్– హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): తెలంగాణలో బీజేపీ బహిష్కృత నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ .. మరోసారి కమలం పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో అధికారంలోకి రాకపోవడానికి కారణం.. బీజేపీ నేతల తీరేనని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ బీజేపీ నేతలకు ఇగో (అహం) ఎక్కువ అని.. అందుకే నేతల్లో మనస్పర్ధలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే రాజాసింగ్ తాజాగా స్పందిస్తూ ఒక వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ నేతలపై రాజాసింగ్ మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి.. పార్టీని అధికారంలోకి తీసుకువస్తున్నారని తెలిపారు. అయితే ఇంకా ఎన్నేళ్లు వేరేవాళ్లు పెళ్లి చేసుకుంటే.. మనం డ్యాన్స్ చేయాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అస్సాం రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో.. తెలంగాణ బీజేపీ నేతలు సంబరాలు చేసుకోవడం పట్ల రాజాసింగ్ సెటైరికల్‌గా స్పందించారు. వేరే రాష్ట్రాల్లో బీజేపీ గెలిస్తే సంబరాలు చేసుకునే వారు.. తెలంగాణలో పార్టీని ఎందుకు గెలిపించలేకపోతున్నారని నిలదీశారు. ఇంకా ఎన్ని సంవత్సరాలు.. బీజేపీని తెలంగాణలో అధికారంలోకి రాకుండా చేస్తారని స్థానిక నేతలపై రాజాసింగ్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఎప్పుడు తీసుకుని వస్తారో చెప్పండని నిలదీశారు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న రాంచందర్ రావుకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తెలంగాణలో అధికారం వస్తుందని తేల్చి చెప్పారు. తెలంగాణలో కొందరు బీజేపీ నేతలు తమ ఈగోయిజాన్ని పక్కన పెట్టాలని హితవు పలికారు. ఈగో లేకుండా పనిచేస్తేనే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. కొంతమంది నేతలకు సిగ్గు ఉంటే.. పశ్చిమ బెంగాల్‌లో ఎలా విజయం సాధించారో చూసి నేర్చుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా తెలంగాణ బీజేపీ నేతలపై రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంఘటనలు ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాకపోవడానికి, మరింతగా విస్తరించకపోవడానికి సొంత పార్టీ నేతలే కారణం అంటూ సంచలన ఆరోపణలు చేశారు. అయితే గతంలో బీజేపీలోనే ఉన్న రాజాసింగ్.. ఆయన చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా.. పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. కానీ రాజాసింగ్ ఎప్పుడూ బీజేపీ హైకమాండ్‌పై విమర్శలు చేయలేదు.

## నెక్స్ట్ టార్గెట్.. తెలంగాణ




హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించామని, అసోంను తిరిగి నిలబెట్టుకున్నామని, ఇక తమ తదుపరి లక్ష్యం తెలంగాణ అని రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ విజయం దిశగా దూసుకెళ్లటంతో హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ జెండా ఎగురుతుందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రజలు మార్పు కోసం చూస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ఒక రాష్ట్రం తర్వాత మరో రాష్ట్రాన్ని కైవసం చేసుకుంటోందని, ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర పురోగతి కోరుకుంటున్న ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సాధ్యమని భావిస్తున్నారని అన్నారు. బెంగాల్‌లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిందని, తమ పార్టీని ఆదరించినందుకు ఆ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో తదుపరి ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమని అన్నారు. దేశంలో బీజేపీ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా, ఆ రాష్ట్ర ప్రజలు తిరిగి తమనే గెలిపిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలతో కూడిన, అవినీతిరహిత, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలను ప్రజలు ఓడించారని అన్నారు. తమిళనాడులో డీఎంకే కూటమికి కూడా ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశం పేరిట రాజకీయాలు చేసే వారికి ప్రజలు సరైన సమాధానం చెప్పారని పేర్కొన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్, ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారని తాజా ఫలితాలను బట్టి తెలుస్తోందని తెలిపారు. మే 10వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఉందని రామచందర్ రావు గుర్తు చేశారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న సభకు రెండు లక్షలమంది హాజరవుతారని రాష్ట్ర నాయకులు భావిస్తున్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## జీహెచ్ఎంసీ జూనియర్ అసిస్టెంట్ లంచగొండి

**రూ.లక్ష లంచం తీసుకుంటూ చిక్కిన అధికారిణి**

హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే అనుమతుల కోసం లంచం డిమాండ్ చేసిన జూనియన్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బోరబండ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీ శ్రీలత సోమవారం బాధితుడి నుంచి రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఇంటి నిర్మాణానికి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకునే దశ నుంచి దానిని ప్రాసెస్ చేసి, గృహ నిర్మాణ అనుమతిని అందజేసే దశ వరకు జూనియర్ అసిస్టెంట్ మొత్తం రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా తొలి విడతగా యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడినందుకు ఆమెపై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.




# కమ్యూనిస్టు పాలన అంతం

**ఏ రాష్ట్రంలో అధికారంలో లేని లెఫ్ట్ పార్టీలు**

**49 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి**

**కేరళలో ఎల్డీఎఫ్ ఓటమితో కనుమరుగు**





న్యూఢిల్లీ: దేశంలో వామపక్షాల పాలనకు ముగింపు పలికినట్లయింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన కొన్నేళ్ల తర్వాత కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు .. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో అక్కడక్కడా వామపక్ష పార్టీల ప్రాబల్యం ఉన్నప్పటికీ.. ఈ 3 రాష్ట్రాల్లో మాత్రమే సొంతంగా అధికారాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర కలిగి ఉంది. అయితే పశ్చిమ బెంగాల్‌లో 2011లో మమతా బెనర్జీ ఎంట్రీతో లెఫ్ట్ పార్టీల పాలన కనుమరుగైంది. అప్పటి నుంచి వరుసగా 3 సార్లు బెంగాల్‌లో విజయం సాధించిన టీఎంసీ.. వామపక్షాల ఉనికి లేకుండా చేసింది. ఇక త్రిపురలో 2 దశాబ్దాల పాటు సాగిన వామపక్ష పాలనకు 2018లో తెరపడింది. ఇక కేరళలో గత 2 ఎన్నికల్లో ఎల్డీఎఫ్ విజయం సాధించగా.. తాజాగా ఓడిపోవడంతో.. వామపక్షాల ప్రాతినిధ్యం పూర్తిగా అంతమైంది. భారతదేశంలో మొట్టమొదటిసారి 1957లో వామపక్ష పార్టీ పాలన మొదలైంది. కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు మాత్రమే ఇప్పటివరకు వామపక్షాల పాలనను చూశాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా కేరళలో లెఫ్ట్ పార్టీ విజయం సాధించింది. భూసంస్కరణలు, సామాజిక సంక్షేమ పథకాలు వంటి విప్లవాత్మక మార్పులను కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానానికి అప్పట్లోనే పునాదులు పడ్డాయి. అయితే.. కేరళలో ప్రతిపక్షాల ప్రతిఘటన కారణంగా 1959లో అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆర్టికల్ 356ను ఉపయోగించి తొలిసారి వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేశారు. ఇది దేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించిన మొదటి ఉదాహరణగా నిలిచింది. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమి 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించినప్పటికీ.. ప్రస్తుత ఎన్నికల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, పినరయి విజయన్ ఒక్కడిపైనే ఎక్కువగా ఆధారపడటం ఎల్డీఎఫ్ కూటమి ఓటమికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. జ్యోతి బసు, బుద్ధదేవ్ భట్టాచార్యల నాయకత్వంలో పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు కమ్యూనిస్ట్ పార్టీ ఎలాంటి అడ్డంకులు లేకుండా పాలన సాగించింది. 1964లో సీపీఐ విడిపోయి సీపీఐ, సీపీఐ(ఎం)లుగా ఏర్పడిన తర్వాత.. ఆ పార్టీ రైతులు, కార్మికులను తన ఓటు బ్యాంకుగా మార్చుకుంది. అదే సమయంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణను సక్సెస్‌ఫుల్‌గా అమలు చేసింది. అయితే.. 1990లలో పారిశ్రామికీకరణ కోసం బలవంతంగా భూసేకరణ చేయడం వంటి నిర్ణయాలు సీపీఐకి గట్టి ఎదురుదెబ్బగా మారాయి. దీంతో చివరికి 2011లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేతిలో లెఫ్ట్ పార్టీ ఓడిపోయి ఆ రాష్ట్రంలో తన ప్రస్థానాన్ని ముగించింది. త్రిపురలో మొదటిసారి 1977లో కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యంగా మాణిక్ సర్కార్ నాయకత్వంలో 1998 నుంచి 2018 వరకు దాదాపు రెండు దశాబ్దాల పాటు వామపక్ష పార్టీ ఆ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఆదివాసీ తెగల మధ్య.. కమ్యూనిస్ట్ పార్టీ చేసిన క్షేత్రస్థాయి కృషి.. వారికి బలమైన పునాదిని ఇచ్చింది. అయితే 2018లో త్రిపురలో కమ్యూనిస్టుల కంచుకోటను బీజేపీ బద్దలు కొట్టింది. జాతీయ స్థాయి అంశాలతో పాటు త్రిపురలోని స్థానిక సమస్యలైన ఉద్యోగుల జీతాల పెంపు, నిరుద్యోగం వంటి సమస్యలపై దృష్టి సారించి విజయం సాధించింది. ఇక ఆర్ఎస్ఎస్ మద్దతుతో త్రిపురలోని యూత్, మహిళలను ఆకర్షించడంలో కమలం పార్టీ సక్సెస్ అయింది. భారతదేశ రాజకీయాల్లో ఒకప్పుడు కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్ట్ పార్టీలు.. తమకు పట్టు ఉన్న 3 రాష్ట్రాల్లో కూడా అధికారాన్ని కోల్పోవడమే కాకుండా.. పార్టీ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారింది.

# ద్రవిడ పార్టీల పాలనకు బ్రేక్

**60 ఏళ్ల తర్వాత మారిన తమిళ రాజకీయం**

**డీఎంకే, అన్నాడీఎంకేను దెబ్బకొట్టిన విజయ్**

**1967 తర్వాత కొత్త పార్టీ జయకేతనం**



చెన్నై: తమిళనాడు అనగానే ద్రవిడ పార్టీల పాలనే గుర్తుకు వస్తుంది. తమిళనాడును గత 6 దశాబ్దాలుగా రెండు పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకేలు మాత్రమే పాలిస్తున్నాయి. 1967లో అన్నాదురై నుంచి మొదలుకుని ప్రస్తుతం ఎంకే స్టాలిన్ వరకు ఈ రెండు పార్టీలే తమిళనాడు రాజకీయాలను శాసిస్తున్నాయి. గతంలో దేశవ్యాప్తంగా ప్రభంజనం సృష్టించిన కాంగ్రెస్ అయినా.. గత 12 ఏళ్లుగా దేశంలో బీజేపీ శరవేగంగా విస్తరిస్తున్నా.. తమిళనాడులో మాత్రం ఆ రెండు పార్టీలు అడుగుపెట్టలేకపోయాయి. అధికారంలో ఉన్న పార్టీకి కాంగ్రెస్ మద్దతు పలికినప్పటికీ సొంతంగా మాత్రం గెలవలేకపోయింది. దీంతో గత 60 ఏళ్లుగా తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల హవా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు 2 ఏళ్ల ముందు తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించిన విజయ్ .. డీఎంకే, అన్నాడీఎంకేలను చిత్తు చేస్తూ.. అధికారం చేజిక్కించుకుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ.. తన పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఈ క్రమంలోనే తమిళనాడులో కొనసాగుతున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని విజయ్ బద్దలు కొట్టారు. తమిళనాడు రాజకీయాల్లో ఎవరూ ఊహించని విధంగా విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ( టీవీకే ) పార్టీ తాజా ఎన్నికల్లో పెను సంచలనం సృష్టించింది. సోమవారం వెలువడిన ఫలితాలు తమిళనాట సరికొత్త రాజకీయ చరిత్రను లిఖించాయి. దీంతో గత ఆరు దశాబ్దాలుగా తమిళనాడులో ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేల మధ్యే సాగుతున్న రాజకీయ ఆధిపత్యానికి విజయ్ చెక్ పెట్టినట్లు అయింది. గతంలో 2019, 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ.. ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగగా.. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ కూడా డీఎంకే విజయమని తేల్చి చెప్పాయి. ఇక డీఎంకే విజయంపై స్టాలిన్ పూర్తి ధీమా వ్యక్తం చేసినా.. ఫలితాలు మాత్రం తారుమారయ్యాయి. మరోవైపు.. 2016లో జయలలిత మరణం తర్వాత.. క్రమక్రమంగా బలహీనపడుతున్న అన్నాడీఎంకే మాత్రం ఈ ఎన్నికల్లో తన ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నాలు చేసింది. బీజేపీతో పొత్తు పెట్టుకోవడం.. పార్టీలో కీలక నేతలుగా ఉన్న కేఏ సెంగోట్టయన్.. పన్నీర్ సెల్వం వంటి వారు రాజీనామా చేసి ఇతర పార్టీల్లోకి వెళ్లడం వంటి పరిణామాలు ఎడప్పాడి పళనిస్వామికి పెను సవాలుగా మారాయి. ఇక విజయ్ తన ఎన్నికల ప్రచారంలో ద్రవిడ అస్తిత్వాన్ని, పెరియార్ సామాజిక న్యాయ సిద్ధాంతాలను నమ్ముకుంటూనే తమిళనాడు ప్రజలకు 6 దశాబ్దాల తర్వాత ఒక కొత్త ప్రత్యామ్నాయ పార్టీని చూపించారు. అన్నాదురై, ఎంజీఆర్ వంటి దిగ్గజాల ఆశీస్సులు తనకు ఉన్నాయని పేర్కొంటూనే.. తమిళ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేసి విజయం సాధించారు. 1967లో ఎం భక్తవత్సలం కాంగ్రెస్ పార్టీ తరఫున చివరిసారిగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అన్నాదురై డీఎంకే పార్టీ తరఫున మొట్టమొదటిసారిగా గెలిచి.. తమిళనాట ద్రవిడ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. ఇక అన్నాదురై తర్వాత కరుణానిధి డీఎంకే పార్టీ తరఫున ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే అప్పటివరకు డీఎంకేలో ఉన్న ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) విడిపోయి.. అన్నాడీఎంకే పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చారు. అనంతరం మళ్లీ కరుణానిధి, జయలలిత, పన్నీరు సెల్వం, పళనిస్వామి, ఎంకే స్టాలిన్.. గత కొన్ని దశాబ్దాలుగా ఈ రెండు పార్టీలు (డీఎంకే, అన్నాడీఎంకే) మధ్యనే తమిళనాడు అధికార మార్పిడి జరిగింది. ఈ క్రమంలోనే 1967 తర్వాత తొలిసారి ఇప్పుడు విజయ్.. డీఎంకే, అన్నాడీఎంకేలకు అధికారాన్ని దూరం చేస్తూ.. టీవీకే పార్టీని గెలిపించారు. ఈ ఎన్నికలు అన్నాడీఎంకే పార్టీకి కొంత కోలుకునే అవకాశాన్ని ఇవ్వగా.. అధికార డీఎంకే పార్టీకి మాత్రం గట్టి ఎదురుదెబ్బగా మారాయి. గత 7 ఏళ్లలో వరుస విజయాలతో జోరు మీదున్న డీఎంకే పార్టీ ఈ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని మిగిల్చింది. ఈ నేపథ్యంలోనే 1962లో కాంగ్రెస్ పార్టీ తర్వాత.. ఒక ద్రవిడయేతర పార్టీ లేదా ఒక కొత్త పార్టీ తమిళ రాజకీయాల్లో ఇంతటి ప్రభావం చూపడం ఇదే తొలిసారి.

## గెలిచిన ప్రముఖులు

**విజయ్ (తమిళనాడు, టీవీకే అధినేత)**

తమిళనాడులో రాజకీయాల్లో మొదటి అడుగులోనే భారీ విజయం సాధించారు. పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ గెలుపొందారు. పెరంబూర్, తిరుచ్చిలో గెలిచారు. ఆయన పార్టీ టీవీకే సంచలనం సృష్టించింది.

**హిమంత బిశ్వ శర్మ (అస్సాం సీఎం, బీజేపీ నేత)**

అస్సాంలో తన నాయకత్వాన్ని మరోసారి బలంగా నిలబెట్టుకున్నాడు. జలుక్‌బరిలో గెలుపొందారు.

**సువేందు అధికారి (పశ్చిమ బెంగాల్, బీజేపీ నేత)**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ బలం పెరగడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నందిగ్రామ్‌లో గెలుపొందారు.

**పినరయి విజయన్ (కేరళ సీఎం, సీపీఎం)**

ధర్మడం నియోజక వర్గం నుంచి పినరయి విజయన్ విజయం సాధించారు. అయితే, కేరళలో ఆయన అధికారాన్ని కోల్పోయారు.

**ఉదయనిధి స్టాలిన్ (తమిళనాడు, డీఎంకే నేత)**

తమిళనాడులోని చెపాక్ నుంచి పోటీ చేసిన ఉదయనిధి స్టాలిన్ గెలుపొందారు.

**వీడీ సతీశన్ (కాంగ్రెస్-కేరళ)**

వీడీ సతీశన్ పరవూర్ నియోజక వర్గం నుంచి గెలిచారు. కేరళలో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు తీసుకురావడంతో కృషి చేశారు.

**పళనిస్వామి (తమిళనాడు మాజీ సీఎం)**

పళనిస్వామి విజయం సాధించారు. ఎడప్పడి నియోజక వర్గం నుంచి ఆయన గెలుపొందారు.

## ఓడిన ప్రముఖులు

**మమతా బెనర్జీ (పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి)**

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అధికారాన్ని కోల్పోయారు. ఎమ్మెల్యేగానూ గెలవలేదు. భవానీపూర్‌లో మమతా బెనర్జీపై సువేందు అధికారి గెలిచారు.

**ఎంకే స్టాలిన్ (తమిళనాడు సీఎం)**

తమిళనాడులో ఎంకే స్టాలిన్ ఎదురుదెబ్బ తిన్నారు. కొళత్తూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన పార్టీ కూడా వెనుకబడింది.

**గౌరవ్ గోగోయ్ (అస్సాం, కాంగ్రెస్)**

జోర్హాత్ నియోజక వర్గం నుంచి పోటీ చేసిన గౌరవ్ గోగోయ్ ఓటమి పాలయ్యారు.

**తమిళిసై (తమిళనాడు, బీజేపీ)**

# ప్రజా తీర్పును గౌరవిస్తున్నా: స్టాలిన్



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై డీఎంకే పార్టీ అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆయన ఓటమిని అంగీకరించారు. తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని అన్నారు. విజేతలకు ఆయన అభినందనలు తెలిపారు. డీఎంకే ఇక నుంచి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ప్రభావవంతమైన ప్రతిపక్షంగా పనిచేస్తుందని అన్నారు. గత ఐదేళ్ల తమ పాలనలో ప్రజల కోసం ఎన్నో ప్రాజెక్టులు చేపట్టామని, సుపరిపాలన అందించామని అన్నారు. ఇన్నాళ్లు సమర్థవంతంగా పాలన అందించామని, ఇక నుంచి నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను చూపించి ప్రజలను ఓట్లు అడిగామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని కొనసాగిస్తామని హామీ కూడా ఇచ్చామని అన్నారు. కానీ తీర్పు తమకు అనుకూలంగా రాలేదని అన్నారు. తన రాజకీయ జీవితంలో అద్భుత విజయాలు చూశానని, అలాగే ఓటములను కూడా చూశానని పేర్కొన్నారు. ఇకముందు డీఎంకే రాజకీయ ప్రయాణం ఎలాంటి తడబాటు లేకుండా కొనసాగుతుందని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. డీఎంకే రెండో స్థానానికి పరిమితమైంది.

# షా మార్క్

**తెరవెనుక వ్యూహాలు.. యువతపై ఫోకస్**

**బెంగాల్ బీజేపీ విజయానికి అనేక కారణాలు**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మమతా బెనర్జీ కంచుకోటగా భావించే అధికారాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 200కి పైగా స్థానాలతో ఈ అద్భుత విజయం వెనుక కేవలం సంప్రదాయ ర్యాలీలు, సభలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో బహుముఖ వ్యూహాలతో కూడిన పక్కా ప్రణాళిక ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల నుంచి సంస్థాగత నిర్మాణం వరకు ప్రతి అంశంలోనూ బీజేపీ ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు వారు విశ్లేషిస్తున్నారు. ఈ విజయంలో యువతను ఆకట్టుకోవడానికి చేపట్టిన "నరేంద్ర కప్" ఫుట్‌బాల్ టోర్నమెంట్లు కీలక పాత్ర పోషించాయని నిపుణులు చెబుతున్నారు. ఈ టోర్నీల్లో దాదాపు 1,200 పురుషుల జట్లు, 253 మహిళల జట్లు పాల్గొన్నాయి. దీని ద్వారా సుమారు 18,000 మంది క్రీడాకారులతో పాటు 18-25 ఏళ్ల మధ్య వయసున్న యువతకు బీజేపీ చేరువైంది. అదేవిధంగా, "వందేమాతరం" 150వ వార్షికోత్సవాన్ని ఒక పెద్ద సాంస్కృతిక ఉద్యమంగా మార్చారు. పాదయాత్రలు, సామూహిక గీతాలాపన, జెండాల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది మందిలో జాతీయ భావోద్వేగాలను నింపడంలో పార్టీ సఫలమైందని పరిశీలకులు పేర్కొంటున్నారు. సంస్థాగత బలం కూడా బీజేపీ గెలుపులో ప్రధాన భూమిక పోషించింది. "పరివర్తన్ యాత్ర" పేరిట 9 వేర్వేరు యాత్రలు నిర్వహించి, 217 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7 లక్షల మందిని భాగస్వాములను చేసింది. ఇక బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు ప్రచారానికి నిశ్శబ్ద వెన్నెముకగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 70,671 బూత్‌లలో కమిటీలు ఏర్పాటు చేసి, 8.7 లక్షల మంది కార్యకర్తలను మోహరించారు. వీరు ఓటర్లను కలవడం, పోలింగ్ రోజున వారిని బూత్‌లకు తరలించడం వంటి పనులను సమర్థంగా నిర్వహించారు. 2019, 2024 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల డేటాను విశ్లేషించి 210 "ఫోకస్ నియోజకవర్గాలను" గుర్తించి, అక్కడ ప్రత్యేకంగా దృష్టి సారించడం కూడా ఫలితాన్నిచ్చింది. ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచడంలోనూ బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా రాష్ట్రస్థాయి చార్జిషీట్‌ను విడుదల చేయగా, 220 నియోజకవర్గాల్లో స్థానిక సమస్యలతో కూడిన చార్జిషీట్లను ప్రజల ముందుంచారు. మరోవైపు, "యువ భరోసా కార్డ్", "మాతృశక్తి భరోసా కార్డ్" పేర్లతో 2 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు సాధించి, యువత, మహిళలకు నేరుగా హామీలు ఇచ్చారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వంటి పండుగల సందర్భంగా 6,250 ప్రాంతాల్లో మతపరమైన, ఆధ్యాత్మిక సంస్థలతో మమేకమయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ 19 ర్యాలీలు, అమిత్ షా 40కి పైగా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రచారానికి ఊపు తెచ్చారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభకు 7.5 లక్షల మంది హాజరుకావడం మానసికంగా ఆధిక్యాన్ని ఇచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "చుప్ చాప్ కమల్ ఛాప్" (నిశ్శబ్దంగా కమలానికి ఓటు) అనే వ్యూహంతో పాటు, "భయ్ అవుట్, భరోసా ఇన్" వంటి నినాదాలు మార్పు, భద్రత, ఆశ అనే భావనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాయి. ఈ విధంగా అన్ని వైపుల నుంచి పక్కా ప్రణాళికతో చేసిన దాడితోనే బీజేపీ బెంగాల్‌లో చరిత్రాత్మక విజయం సాధించిందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# విజయ్ డ్రైవర్ కొడుకు విన్

**27,086 ఓట్ల మెజార్టీతో గెలుపు**

చెన్నై: టీవీకే పార్టీ అధినేత, సినీ నటుడు విజయ్‌కి చాలాకాలంగా డ్రైవర్‌గా, వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నరాజేంద్రన్ కుమారుడు ఆర్.శబరినాథన్ (30) విరుగంబాక్కం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. సమీప డీఎంకే అభ్యర్థి ప్రభాకరరాజాపై 27,086 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శబరినాథన్‌కు 76,092 ఓట్లు రాగా, ప్రభాకరరాజాకు 49,006 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన అనంతరం ఆర్.శబరినాథన్ మాట్లాడుతూ, ఈ గెలుపుతో తాను చాలా సంతోషంగా ఉన్నానని అన్నారు. తనకు టిక్కెట్ ఇచ్చి గెలుపుకు కృషి చేసిన విజయ్‌కు ఎప్పటికీ కృతజ్ఞుడిగా ఉంటానని అన్నారు. విజయ్ రాష్ట్రంలో డీఎంకే పాలనకు ముగింపు పలికారని వ్యాఖ్యానించారు. ఆర్.శబరినాథన్ తండ్రి రాజేంద్రన్ సుదీర్ఘకాలంగా విజయ్ డ్రైవర్‌గా, వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నారు. విజయ్ తొలి చిత్రం 'నాళైయ తీర్పు' నుంచి, దాదాపు ముప్పై ఐదేళ్లుగా ఆయన వద్ద పనిచేస్తున్నారు. చెన్నై జిల్లాలోని విరుగంబాక్కం నియోజకవర్గం నియోజకవర్గంలో 2011లో డీఎండీకే, 2016లో అన్నాడీఎంకే, 2021లో డీఎంకే విజయం సాధించగా, ఇప్పుడు టీవీకే విజయం సాధించింది.

# కరూర్ మృతులకు విజయం అంకితం

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ గెలుపును కరూర్ తొక్కిసలాట మృతులకు అంకితమిచ్చింది. ఎన్నికల ప్రచారంలో జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. "ఈ చారిత్రక విజయాన్ని కరూర్‌లో మనం కోల్పోయిన 41 మంది కుటుంబాలకు అంకితమిస్తున్నాం" అని టీవీకే నేత ఆధవ అర్జున ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించి, ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన డీఎంకే, ఏఐఏడీఎంకేల ఆధిపత్యానికి గండికొట్టింది. మహిళలు విజయ్‌ను తమ కొడుకుగా, సోదరుడిగా భావించి మద్దతు ఇవ్వడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆధవ అర్జున తెలిపారు. ఈ తీర్పును ఒక విప్లవంగా అభివర్ణించిన ఆయన, కరూర్ ఘటనకు డీఎంకేదే బాధ్యత అని ఆరోపించారు. ఫలితాల అనంతరం పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు టీవీకే అధిష్ఠానం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. గెలిచిన ఎమ్మెల్యేలను చెన్నై సమీపంలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీవీకేతో పొత్తు పెట్టుకునే అవకాశాలపై కాంగ్రెస్ పార్టీ తమ అధిష్టానానికి నివేదిక పంపినట్లు సమాచారం. విజయ్ విజయంపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అభినందనలు తెలిపారు. గతంలో రజనీకాంత్, కమల్ హాసన్ వంటి నటుల రాజకీయ ప్రవేశానికి భిన్నంగా, క్షేత్రస్థాయిలో యువతను, మార్పు కోరుకునే వర్గాలను ఏకం చేసి విజయ్ ఈ విజయాన్ని అందుకున్నారు. ఈ ఫలితాలతో తమిళనాడు రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయం మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అసోంలో హిమంత ఘన విజయం



గౌహతి: అసోం అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఘనవిజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరి నుంచి హిమంత ఏకంగా 89,434 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులను చిత్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బిదిష నియోగ్‌కు కేవలం 37,717 ఓట్లు మాత్రమే రావడంతో హిమంత వ్యక్తిగత క్రేజ్ ఏంటో మరోసారి స్పష్టమైంది. హిమంతకు 1,27,151 ఓట్లు వచ్చాయి. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల విషయంలో హిమంత అనుసరించిన కఠిన వైఖరి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివాసీ భూములను చొరబాటుదారుల నుండి విముక్తి కల్పించడం ఆయనకు అన్ని వర్గాల మద్దతు తెచ్చిపెట్టింది. చికెన్‌నెక్ కారిడార్‌పై బంగ్లాదేశ్ ప్రకటనలను సమర్థవంతంగా తిప్పికొట్టడం, వరద నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలు ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేశాయి. ఎన్ఆర్‌సీ అమలు, చొరబాట్లకు శాశ్వత అడ్డుకట్ట వేస్తామన్న బీజేపీ హామీ ఓటర్లలో నమ్మకాన్ని కలిగించింది.

## లాభపడ్డ సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. అయితే, ట్రేడింగ్ ప్రారంభంలో నమోదైన భారీ లాభాలను చివరికి నిలుపుకోలేకపోయాయి. కొనసాగుతున్న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో నెలకొన్న అనిశ్చితి, ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు ఒడుదుడుకులకు లోనయ్యాయి. చివరికి, సెన్సెక్స్ 356 పాయింట్ల లాభంతో 77,269.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121.75 పాయింట్లు పెరిగి 24,119.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సెషన్‌లో ఫ్రంట్‌లైన్ సూచీల కంటే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.63%, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.70% చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, రియల్టీ, మెటల్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించగా, ఐటీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లు వెనుకబడ్డాయి. దీంతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. సెన్సెక్స్ సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్, మారుతీ సుజుకీ ఇండియా అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మరోవైపు, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, ఇండిగో, ఐటీసీ, ఇన్ఫోసిస్ వంటి షేర్లు నష్టపోయాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి సమీప కాలంలో 24,000, 23,800 స్థాయిల వద్ద బలమైన మద్దతు ఉంది. అదే సమయంలో 24,200--24,300 స్థాయిల వద్ద నిరోధం ఎదురవుతోంది. అంతర్జాతీయంగా, హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న నౌకల భద్రత కోసం యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ఆపరేషన్ ఫ్రీడమ్' ప్రకటించడంతో ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 0.39 శాతం తగ్గి 107.75 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది.

## మమతా హింసాత్మక ఆట ముగిసింది

ముంబై: పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధిస్తున్న భారీ ఆధిక్యంపై ఎంపీ నవనీత్ కౌర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శనాస్త్రాలు సంధించారు. మమత గతంలో ఇచ్చిన 'ఖేలా హోబే' నినాదాన్ని ప్రస్తావిస్తూ.. బెంగాల్‌లో దీదీ ఆడిన హింసాత్మక రాజకీయాల ఆట ముగిసిందని (ఖేలా ఖతం), ఇకపై అక్కడ అభివృద్ధి (వికాస్) పర్వం ప్రారంభమవుతుందని ఆమె వ్యాఖ్యానించారు. టీఎంసీ పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని... అవినీతి, మహిళలపై అకృత్యాలు పెరిగిపోయాయని ఆరోపించిన ఆమె, ఆ నియంతృత్వ వైఖరికి ప్రజలు ఇచ్చిన సమాధానం ఈ ఫలితాలే అని పేర్కొన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి జరిగిన అక్రమ వలసలను ఉద్దేశించి మాట్లాడుతూ, తిరిగి వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

# ఫోర్త్ సిటీ కాదు.. రైతుల కడుపు నింపండి

**వడ్లు కొనకుండా అన్నదాతను ఏడిపిస్తారా?**

**ప్రభుత్వంపై మాజీమంత్రి జీవన్ రెడ్డి ఫైర్**



కొడిమ్యాల, మే 4 (ఈవార్తలు): ఫోర్త్ సిటీ ఎక్కడికీ పారిపోదని, కానీ కల్లాల్లో వడ్లు తడిస్తే రైతు బతుకు దెబ్బతింటుందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా రైతుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. కొడిమ్యాల మండలం పూడూరు చౌరస్తాలో సోమవారం వడ్లు కొనుగోలు చేయాలని రైతులు చేపట్టిన ధర్నాకు జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, రైతు పండించిన ధాన్యాన్ని కొనలేని ప్రభుత్వం మెగా ప్రాజెక్టుల పేరుతో గాలిమేడలు కడుతోందని విమర్శించారు. వెంటనే తూకం ప్రారంభించి వడ్లు కొనాలని, లేకపోతే రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు కష్టాలు కనిపించడం లేదని విమర్శించారు. రెండున్నరేళ్లు గడిచినా రైతులకు ప్రయోజనం చేకూరలేదన్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో కల్లాల్లో ధాన్యం తడిసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తూకం కోసం ఎండలో వేచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాతో కరీంనగర్-జగిత్యాల రహదారిపై ట్రాఫిక్ స్థంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని జీవన్ రెడ్డి, రైతులతో చర్చించి ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా విద్యుత్ భద్రత వారోత్సవాలు

జగిత్యాల, మే 4 (ఈవార్తలు): గృహ వినియోగదారులు, రైతులు తమ దైనందిన జీవితంలో విద్యుత్ వినియోగంపై అత్యంత జాగ్రత్త వహించాలని జగిత్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శనం సూచించారు. జీరో ప్రమాదాల లక్ష్యంతో మే 1 నుంచి 7 వరకు సర్కిల్ వ్యాప్తంగా విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది గ్రామాలు, కాలనీలు, వ్యవసాయ ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వర్షాల సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, వైర్లు, స్విచ్ బోర్డులు తాకరాదని, తెగిపోయిన లేదా వేలాడుతున్న తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. జి.ఐ. దండెలకు బదులుగా ప్లాస్టిక్ దండెలను ఉపయోగించాలని, ఇంటి వద్ద మెటల్ షీట్లు, గేట్లకు వైర్లు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ మోటార్లు, పైపులు తడిగా ఉన్నప్పుడు తాకరాదని, సరైన ఎర్తింగ్ తప్పనిసరి అని చెప్పారు. విద్యుత్ పనులు అర్హత కలిగిన ఎలెక్ట్రిషియన్ ద్వారానే చేయించాలని సూచించారు. నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ గల పరికరాల వినియోగం అవసరమన్నారు. పంట పొలాల్లో కరెంట్ ఫెన్సింగ్ పెట్టడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ఎటువంటి సమస్యలకైనా 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



## జ్యువెలరీ ఘటన బాధితులకు కేటీఆర్ పరామర్శ

కరీంనగర్, మే 4 (ఈవార్తలు): కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడిన సిబ్బందిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం అందించేందుకు పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన నేతలు, రాష్ట్రంలో చట్టవ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. వ్యాపారులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు**




జగిత్యాల, మే 4 (ఈవార్తలు): ప్రజావాణి అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని తెలిపారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జనాభా లెక్కల స్వీయ గణన-2027పై జిల్లా స్థాయి అధికారులకు సూచనలు చేశారు. ప్రతి అధికారి తమ పరిధిలోని సిబ్బందితో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజా గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అగ్నిప్రమాదంతో తాటి, ఈత వనం దగ్ధం

**గౌడ కుటుంబాలకు ప్రభుత్వ సహాయం కోరుతూ వినతి**

కథలాపూర్, మే 4 (ఈవార్తలు): కథలాపూర్ మండలం అంబారిపేట గ్రామంలో మే 1న జరిగిన అగ్నిప్రమాదంలో గౌడ కులస్తులు పెంచుకున్న సుమారు 24 ఎకరాల ఈత, తాటి వనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో జీవనోపాధి కోల్పోయిన సుమారు 50 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో బాధితులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు డా. చంద్రశేఖర్ గౌడ్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అగ్నిప్రమాదంతో వృత్తిని కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, తక్షణ సహాయంతో పాటు దీర్ఘకాలిక పునరావాస చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో



అంబారిపేట గ్రామానికి చెందిన గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## మల్యాలలో బీజేపీ శ్రేణుల సంబురాలు

మల్యాల, మే 4 (ఈవార్తలు): బెంగాల్, పుదుచ్చేరి, అస్సాంలో బీజేపీ, మిత్రపక్షాల విజయాన్ని శ్రేణులు పండుగలా చేసుకుంటున్నాయి. బీజేపీ మల్యాల మండల శాఖ ఆధ్వర్యంలో పటాకులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. మోదీ, అమిత్ షా నాయకత్వంలో బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేశామని.. అక్కడి ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కారుకు మద్దతు ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, మహిళామూర్తి అధ్యక్షురాలు కట్కం లత, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొనుగంటి గౌతం, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బొమ్మన పరమేశ్, ప్రధాన కార్యదర్శులు పొన్నం సాయికుమార్, పిల్లి రాజశేఖర్, మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి, మండల ఉపాధ్యక్షులు కోను శ్రీనివాస్, గుగ్గిళ్ల గంగరాజం, మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేశ్, అవుదుర్తి రమ, రాచర్ల రాములు, నక్కా ఆనందం, రుత్త కిషన్, పంబాల గంగాధర్, గంగిశెట్టి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, మే 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం సేకరణలో జాప్యం చేయడం వల్ల రైస్ మిల్లుల్లో గత సీజన్ ధాన్యం నిల్వగా ఉందని విమర్శించారు. వెంటనే ధాన్యం తరలింపుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొడ్డు వడ్లకు అధిక మద్దతు ధర కారణంగా రైతులు ఆ పంట వైపు మళ్లుతున్నారని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. మొక్కజొన్నకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర సరిపోక రాష్ట్ర ప్రభుత్వం అదనంగా భారం భరిస్తోందని పేర్కొన్నారు. జీపీఎస్ నిబంధనల సడలింపుతో కొనుగోళ్లు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. ప్రభుత్వాన్ని మాత్రమే విమర్శించడం సరైంది కాదని, కేంద్రం జాప్యాన్నీ ప్రశ్నించాలని జీవన్‌రెడ్డికి సూచించారు. రైతుల పేరుతో రాజకీయాలు చేయవద్దని, పరిష్కార మార్గాలు చూపాలని హితవు పలికారు. తెలంగాణ జీఎస్టీ చెల్లింపుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ నిధుల కేటాయింపులో కేంద్రం మొండి వైఖరి విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం నిల్వకు సిరిసిల్ల గోదాములు

**మంత్రి ఉత్తమ్‌కు అడ్లూరి వినతి**



హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం నిల్వకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అఫరల్ పార్క్ గోదాములను కేటాయించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆకాల వర్షాలు, ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఇందులో పాల్గొన్న మంత్రి అడ్లూరి మాట్లాడుతూ, గత ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికీ జిల్లాలోని రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్నదని తెలిపారు. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో నిల్వ స్థలాల కొరతతో తూకం వేసిన ధాన్యం లారీలు మిల్లుల వద్దే నిలిచిపోతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సిరిసిల్ల జిల్లాలోని అఫరల్ పార్క్ గోదాములను జగిత్యాల ధాన్యం నిల్వకు వినియోగించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు.



## భూసార రక్షణపై ఎమ్మెల్యే సంజయ్ ప్రతిజ్ఞ

జగిత్యాల రూరల్, మే 4 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అవగాహన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్ష విశ్లేషణ పత్రాలు, జాతీయ ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. అనంతరం రైతులతో కలిసి భూసార సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూసారాన్ని కాపాడుతూ సహజ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే దిగుబడులు పెరగడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏఓ భాస్కర్, ఏడీఏ తిరుపతి నాయక్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, సర్పంచ్ కవిత, ప్రొఫెసర్ సుజాత, శాస్త్రవేత్తలు రవి, రాజేష్, స్వాతి, ఏఈఓ హరీష్, మాజీ సర్పంచులు చెరుకు జాన్, తిరుపతి రెడ్డి, తిరుపతి, రాజేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ అబద్ధం

**కొండగట్టులో ప్రమాణం చేయగలరా?**

**జీవన్‌రెడ్డికి ఎమ్మెల్యే సత్యం సవాల్**

చొప్పదండి, మే 4 (ఈవార్తలు): గత ప్రభుత్వంలో క్వింటాల్‌కు 8 కిలోల వరకు తరుగు పేరుతో దోపిడీ జరిగిందని ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సవాల్ విసిరారు. ప్రస్తుతం ఎక్కడైనా ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ జరుగుతుందో చూపించాలని, లేకపోతే కొండగట్టులో ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోపణలు నిజమైతే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకగా ఉన్న జీవన్‌రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్ తరఫున మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వెళ్లాలి, కేసీఆర్ రావాలన్న వ్యాఖ్యలపై ఎందుకు రావాలో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన జీవన్‌రెడ్డి ఇప్పుడు భిన్నంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో ఆన్‌లైన్ విధానంలో ఇబ్బందులు తలెత్తడంతో ప్రస్తుతం పాత విధానంలో కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు.

# విజయ్‌కు అభినందనలు: సూర్య కుమార్



హైదరాబాద్, మే 4 (ఈవార్తలు): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే విజయంపై ప్రముఖ సామాజిక కార్యకర్త నక్క సూర్య కుమార్ హర్షం వ్యక్తం చేశారు. 'ఈ రోజు తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇది కేవలం ఒక పార్టీ విజయం కాదు, మార్పు కోరుకున్న కోట్లాది తమిళ ప్రజల విజయం. విజయ్ నాయకత్వంపై ప్రజలకు ఉన్న అపార విశ్వాసానికి, వారి ఆశీర్వాదాలకు ఈ భారీ విజయం నిదర్శనం. హీరోగా ప్రజల మనసులు గెలుచుకున్న విజయ్, రాజకీయాల్లో కూడా విజయాన్ని సాధించడం ద్వారా యువతకు కొత్త దారిని చూపించారు. విజయ్ తలపతి గెలుపు - తమిళనాడు మలుపు అనే నినాదం ఇప్పుడు వాస్తవంగా మారింది' అని తెలిపారు. ఈ సందర్భంగా, వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకురావాలని, ముఖ్యంగా నర్సింగ్ ఆఫీసర్స్ సంక్షేమం కోసం ప్రత్యేక విధానాలు, కొత్త ప్రణాళికలు తీసుకురావాలని ఆయన కోరారు. ఆరోగ్య వ్యవస్థలో నర్సింగ్ వర్గం కీలక పాత్ర పోషిస్తున్నందున, వారికి గౌరవం, భద్రత, న్యాయమైన అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.



## మంత్రులు పొన్నం, అడ్లూరికి పెద్ద జయంతి ఆహ్వానం

మల్యాల, మే 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి పెద్ద జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఆలయ అర్చకులు, అధికారులు ఆహ్వాన పత్రికను సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ, పెద్ద హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యాలు సమృద్ధిగా కల్పించాలని సూచించారు. భక్తులకు తక్కువ సమయంలో సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవి, వేదపండితులు పెద్దన్న శర్మ, సూపరింటెండెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురి దుర్మరణం**

శ్రీకాళహస్తి, మే 4 (ఈవార్తలు): ఏపీలోని తిరుపతి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద పుత్తలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఓ అంబులెన్స్ వేగంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఓ రోగిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగంతో వచ్చిన అంబులెన్స్, అప్పటికే రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది.



## హోంమంత్రి రాజీనామా చేయాలి: దావ వసంత

జగిత్యాల, మే 4 (ఈవార్తలు): కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ షాపులో జరిగిన దోపిడి ఘటన తీవ్రంగా బాధాకరమని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర, రాష్ట్ర హోంశాఖ మంత్రులు రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రానికి భారీగా పన్నులు చెల్లిస్తున్న వ్యాపారులకు కనీస రక్షణ కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హోంశాఖ బాధ్యతలను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా నిర్వహించడం వల్ల శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎలా ముందుకు వస్తారని ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం అసమర్థతకు నిదర్శమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుండగులు ఎలాంటి భయం లేకుండా మాస్కులు ధరించి తుపాకులతో సంచరిస్తూ వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తొలి ఎన్నికల్లోనే భారీ విజయం గొప్పది

**విజయ్‌కు వైఎస్ జగన్ అభినందనలు**

తాడేపల్లి, మే 4 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న వేళ ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ముఖ్యంగా తమిళనాడులో నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి ఎన్నికల్లోనే సంచలన ప్రదర్శన చేయడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు జగన్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు.




## నల్లగొండలో ఎస్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

నల్లగొండ, మే 4 (ఈవార్తలు): ఎస్పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండ ఏరియా హాస్పిటల్‌లో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా సిద్ధం అవుతున్నట్లు ఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్ తెలిపారు. నల్లగొండ నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా అభిషేకం, అధ్యక్షురాలిగా రామేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా జీ సరిత, ప్రధాన కార్యదర్శిగా ప్రణయ్, కోశాధికారిగా శారద, కమిటీ సభ్యులుగా కవిత, చంటి, మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కార్మికులు పాల్గొన్నారు.

లయ్యారి చిత్రం



కుషి దుబే




## విశ్వంభరలో త్రిష లుక్ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫాంటసీ ఎపిక్ విశ్వంభర నుంచి వచ్చిన తాజా అప్డేట్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ కేవలం విజువల్‌గా మాత్రమే కాకుండా కథపై కూడా ఆసక్తిని పెంచేలా ఉంది. ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపించిన త్రిష, ఈసారి కేవలం గ్లామర్ రోల్‌కే పరిమితం కావడం లేదని క్లియర్ సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాలో త్రిష పోషించిన అవని క్యారెక్టర్ కథలో కీలక మలుపులు తీసుకొచ్చే కోర్ ఎలిమెంట్‌గా ఉండనుందని తెలుస్తోంది. అంటే, ఈ సినిమా నెరేషన్ మొత్తం ఈ పాత్ర చుట్టూనే తిరిగే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. ఇదే పాయింట్ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన బలంగా మారుతోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే అవని పాత్రలో ఎక్కువ డెప్త్, ఎమోషనల్ వెయిట్ ఉండబోతుందని సమాచారం. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్ మాత్రమే కాదు, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా ఆమె పాత్ర ఉండనుండటంతో, ఇది ఆమె కెరీర్‌లో ఒక టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్న చర్చ మొదలైంది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు ఈ సినిమా స్ట్రాంగ్ కంబ్యాక్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో రీచ్ ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో పవర్‌ఫుల్ రోల్ దక్కడం, ఆమెను మళ్లీ టాప్ లీగ్‌లో నిలబెట్టే ఛాన్స్‌గా ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

## జననాయగన్‌కు లైన్ క్లియర్

సినిమా గ్లామర్ కి రాజకీయ పవర్ తోడైతే వచ్చే కిక్కే వేరు. ఇప్పుడు తమిళనాడులో సరిగ్గా ఇదే జరుగుతోంది. దళపతి విజయ్ తన సినీ ప్రయాణానికి స్వస్తి చెప్పి పూర్తిస్థాయి రాజకీయాల్లోకి రావడంతో, ఆయన ఆఖరి సినిమా 'జననాయగన్' పై అందరి దృష్టి పడింది. గత కొన్నాళ్లుగా ఈ సినిమా చుట్టూ ఏదో ఒక వివాదం తిరుగుతూనే ఉంది. అసలు ఈ చిత్రం థియేటర్లలోకి వస్తుందా లేదా అన్న సందిగ్ధంలో ఉన్న తరుణంలో ఇప్పుడు సీన్ మొత్తం రివర్స్ అయినట్లు కనిపిస్తోంది. సాధారణంగా ఒక స్టార్ హీరో సినిమా అంటే రిలీజ్ కు ముందే భారీ అంచనాలు ఉంటాయి. కానీ ఇక్కడ సినిమా కంటే విజయ్ రాజకీయ భవిష్యత్తు పైనే ఎక్కువ చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకేకు ఎన్నికల ఫలితాల్లో వస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ ఇప్పుడు సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ అయ్యేలా ఉంది. సీఎం కుర్చీ పై ఇంకా క్లారిటీ రాకపోయినప్పటికీ, మెజారిటీ ఫలితాలు విజయ్ కి అనుకూలంగా ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు బాక్సాఫీస్ లెక్కలను మార్చేస్తున్నాయి. అసలు విషయం ఏంటంటే, 'జననాయగన్' సినిమాకు మొదట్లో సెన్సార్ పరంగా చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. దానికి తోడు ఎడిటింగ్ రూమ్ నుంచే సినిమానే లీక్ అవ్వడం చిత్ర యూనిట్ ను ఆందోళనలో పడేసింది. పైరసీ దెబ్బతో సినిమా పరిస్థితి ఏంటో ఎవరికీ అర్థం కాలేదు. కానీ ఇప్పుడు ఎన్నికల్లో విజయ్ కు వస్తున్న ఆదరణ చూస్తుంటే, ఆ నెగటివ్ వైబ్స్ అన్నీ తొలగిపోయి సినిమాకు ఒక మంచి శకునం లాగా అనిపిస్తోంది. రాజకీయంలో దొరుకుతున్న ఈ మైలేజ్ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేయడానికి మార్గం సుగమం చేస్తోంది.



## దీదీకి సరైన బుద్ధి చెప్పారు



పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయంపై టాలీవుడ్ హీరో నిఖిల్ ట్వీట్ చేశారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ దారుణాలను ప్రజలు ఇంకా మరిచిలేదు.. క్షమించనూ లేదన్నారు. అందుకే మమతా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని రాసుకొచ్చారు. సామాన్యుడిని పట్టించుకోని ప్రభుత్వానికి ఇలాంటి గతే పడుతుందన్నారు. ఆర్జీ కర్ వైద్య కళాశాల బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు. గతంలో ఈ దారుణంపై తాను మాట్లాడిన వీడియోను కూడా పోస్ట్ చేశారు. కాగా.. ఇవాళ వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. అధికారంలో ఉన్న టీఎంసీ ప్రభుత్వాన్ని కూలగొట్టింది. ఇప్పటికే మూడుసార్లు సీఎంగా పనిచేసిన మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో ఓటమిపాలైంది. ఆమె ప్రభుత్వంలోనే ఆర్జీకర్ వైద్య కళాశాలలో ఓ వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరిగిన సంగతి తెలిసిందే.

## ఉత్తరాదిపై పెద్ది మార్క్


పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ పెద్ది ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. బాలీవుడ్ స్టార్ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా, కేవలం కాస్టింగ్ వల్లే కాదు, రిలీజ్ స్ట్రాటజీ కారణంగా కూడా ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా జియో స్టూడియోస్ ఈ సినిమాను నార్త్ మార్కెట్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి రూపొందిస్తున్న ప్లాన్ ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సౌత్ మార్కెట్‌లో ఇప్పటికే బలమైన స్థానం సంపాదించుకున్న రామ్ చరణ్, ఇప్పుడు నార్త్ ఇండియాలో తన మార్కెట్‌ను మరింత విస్తరించాలనే టార్గెట్ తో ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్ట్రాటజీలో అత్యంత ఆసక్తికర అంశం నార్త్ ఇండియాలో ప్రీమియర్ షోలు ప్లాన్ చేయడమే. సాధారణంగా ప్రీమియర్స్ అనేవి తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కువగా కనిపించే ట్రెండ్. కానీ పెద్ది కోసం ఈ సౌత్ స్టైల్ రిలీజ్ కల్చర్‌ను నార్త్ మార్కెట్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుండటం విశేషం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, రిలీజ్‌కు ముందు రాత్రే మల్టీప్లెక్సుల్లో పెద్దికి సంబంధించిన స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తున్నారట.






## హాట్ సీన్స్ తొలగించాలని అడగలేదు: కియారా

కన్నడ స్టార్ యశ్ సరసన కియారా అద్వానీ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రంలోని బోల్డ్ సీన్ల విషయంలో వస్తున్న వార్తలను ఆమె స్వయంగా ఖండించింది. ఈ సినిమాలో తనపై ఉండే కొన్ని హాట్ సీన్స్ తొలగించమని తాను కోరినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, అవన్నీ నిరాధారమైన పుకార్లని ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పష్టం చేసింది. ఈ చిత్ర టీజర్ విడుదలైనప్పటి నుండి కియారా పాత్ర మరియు సినిమాలోని సన్నివేశాలపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. కియారా ఇచ్చిన క్లారిటీతో ఈ పుకార్లకు చెక్ పడినట్లయింది. చిత్ర యూనిట్ నుండి ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా వస్తున్న ఇటువంటి వార్తలను నమ్మవద్దని ఈ సందర్భంగా అర్థమవుతోంది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ జూన్ 4న విడుదల కావాల్సి ఉండగా, ప్రస్తుతం వాయిదా పడింది. మేకర్స్ త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారు.




## డిసెంబర్ 1న స్పిరిట్?

టాలీవుడ్ స్టార్ నటుడు ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్, కల్కి-2 చిత్రాల్లో నటిస్తున్నాడు. ఈ మూడు చిత్రాల షూటింగుల్లో ఏకకాలంలో పాల్గొంటుండటంతో ఒక సినిమా షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకుంటే మిగతా రెండు సినిమాల షెడ్యూల్స్‌పై కూడా దాని ప్రభావం పడుతోంది. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న స్పిరిట్ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసుకున్నారు. అందుకు అనుగుణంగా కొన్ని షెడ్యూల్స్ కూడా పూర్తయ్యాయి. అయితే ప్రస్తుతం షూటింగ్ అనుకున్నంత వేగంగా జరగడం లేదని, దాంతో ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేయడం కాస్త కష్టమనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో సందీప్ వంగా తనకు బాగా కలిసి వచ్చిన ఓ డేట్‌పై దృష్టి పెట్టినట్లు సమాచారం. గతంలో ఆయన దర్శకత్వంలో వచ్చిన యానిమల్ చిత్రాన్ని డిసెంబర్ 1న విడుదల చేయగా, ఆ సినిమా 900 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి భారీ విజయాన్ని సాధించింది. ఈ సక్సెస్ ఫార్ములాను దృష్టిలో పెట్టుకొని స్పిరిట్ విషయంలో కూడా అదే డేట్‌ను లాక్ చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ సినిమా మార్చిలో విడుదల కాకపోతే వచ్చే ఏడాది డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నారని సమాచారం.

## ఆలియా బిజీ బిజీ

బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్ 'ఆల్ఫా' సినిమాతో రెండేళ్ల తర్వాత ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతుంది. ఈ సినిమాతో పాటు అలియా మరో సినిమా కూడా చేస్తోంది. రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్' సినిమాలో కూడా అలియా నటిస్తోంది. మొత్తానికి వరుస చిత్రాలతో బిజీగా ఉన్న అలియా, ఇప్పుడు 'తుంబాడ్ 2' చిత్రంలో కూడా నటిస్తున్నట్లు తెలుస్తోంది. హారర్ మైథలాజికల్‌గా ఆదేశ్ ప్రసాద్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. తాజాగా ఇప్పుడు ఈ సినిమాలో అలియా భట్ కూడా నటించబోతుంది. చిత్రబృందం అలియాని ఖరారు చేసిందని తెలిసింది. కాగా "తుంబాడ్ 2' చిత్రంలో అలియా భట్ ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించనుందని.. నిజానికి ఆమె పాత్ర చిన్నదే అయినా.. సినిమాపై ఆమె కీలకమైన ప్రభావం చూపించబోతుందట. ప్రధానంగా ఆమె పాత్ర సెకండ్ హాఫ్ లో వస్తోందట. మొత్తమ్మీద అలియా భట్ మళ్లీ సినిమాల్లో ఫుల్ బిజీ అవుతుంది.







# ముంబై విన్

## రోహిత్, రికెల్టన్ విధ్వంసం

### భారీ లక్ష్యాన్ని ఛేదించిన ముంబై

**లక్నోపై 6 వికెట్ల తేడాతో గెలుపు**

**లక్నో తరపున పూరన్ 21 బంతుల్లోనే 63 పరుగులు**



ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖెడే స్టేడియంలో జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ ఘనవిజయం సాధించింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 229 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 8 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

**ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 83), రోహిత్ శర్మ (44 బంతుల్లో 84) వీరవిహారం చేసి ముంబై విజయాన్ని సులభతరం చేశారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్‌కు లక్నో బ్యాటర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా నికోలస్ పూరన్ (21 బంతుల్లో 63; 1 ఫోర్, 8 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.**

మిచెల్ మార్ష్ (44), హిమ్మత్ సింగ్ (40 నాటౌట్) తోడవడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు చేసింది. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ రెండు వికెట్లు తీశాడు. భారీ లక్ష్య ఛేదనలో ముంబైకి ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 10.5 ఓవర్లలోనే 143 పరుగులు జోడించి మ్యాచ్‌ను లక్నో చేతుల్లోంచి లాగేశారు. ముఖ్యంగా రికెల్టన్ 8 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ ఔటయ్యాక తిలక్ వర్మ (11), సూర్యకుమార్ యాదవ్ (12) త్వరగానే పెవిలియన్ చేరినా, నమన్ ధీర్ (23 నాటౌట్), విల్ జాక్స్ (10 నాటౌట్) మిగిలిన పని పూర్తి చేసి ముంబైకి అద్భుత విజయాన్ని అందించారు.

**మా పరిస్థితి బాలేదు: పంత్**

తమ జట్టు పరిస్థితి ఏ మాత్రం బాలేదని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ అన్నాడు. కాస్త అదృష్టం కలిసి వస్తే విజయాలు సాధిస్తామని చెప్పాడు. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన రిషభ్ పంత్.. లోయరార్డర్ బ్యాటింగ్ వైఫల్యం తమ విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. తమ లక్ష్యానికి అదనంగా 10–15 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్నాడు. ఈ వికెట్‌పై 229 పరుగుల లక్ష్యం సరిపోదని, ఈ ఓటమికి బౌలర్లను నిందించలేమని చెప్పాడు. ముంబై బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారని కొనియాడాడు. 'మా లక్ష్యానికి కొన్ని పరుగులు తక్కువ చేశాం. మాకు లభించిన ఆరంభానికి మేం భారీ స్కోర్ చేయాల్సింది. మా బ్యాటర్లు చాలా స్వేచ్ఛగా ఆడారు. కానీ ముంబై బౌలర్లు అద్భుతంగా పుంజుకొని మమ్మల్ని కట్టడి చేశారు. వారికి ఈ వికెట్ పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. మేం 10–15 పరుగులు తక్కువ చేశాం. ఇది 230–240 పరుగులు చేయాల్సిన వికెట్. ఇన్నింగ్స్ ఆరంభంలో ముంబైపై మేం పైచేయి సాధించాం. కానీ ఇలాంటి వికెట్‌పై ప్రతిసారీ బౌలర్లను నిందించలేం. మా బౌలర్లు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. కాబట్టి ఈ ఓటమికి వారిని నేను బాధ్యులను చేయను. మా జట్టుకు కొంచెం అదృష్టం కావాలి బాస్. నేను చెప్పగలిగేది అదే. అదృష్టం ఎలా వస్తుంది? అంటే.. చాలా మంది దీవెనలు ఉంటే లక్ మావైపు ఉంటుందని భావిస్తున్నా. అలాగే మా వైపు నుంచి ఇంకా ఎక్కువ కష్టపడాల్సి ఉంది. ఇది మాత్రం ఖాయం'అని పంత్ పేర్కొన్నాడు.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 9 | 6 | 1 | 13 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 12 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 12 |
| చెన్నై | 9 | 4 | 5 | 8 |
| ఢిల్లీ | 9 | 4 | 5 | 8 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 7 |
| ముంబై | 10 | 3 | 7 | 6 |
| లక్నో | 9 | 2 | 7 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

## ధోనీ వచ్చేస్తాడు: సీఎస్కే యాజమాన్యం

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నా సీఎస్కే అభిమానులు మాత్రం తమ ఆరాధ్య దైవం ఎంఎస్ ధోనీ స్టేడియంలోకి ఎప్పుడు వస్తాడా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్ ప్రారంభంలోనే పిక్క కండరాల గాయం బారిన పడిన ఎంఎస్ ధోనీ.. ఇప్పటివరకు సీఎస్కే ఆడిన 9 మ్యాచ్‌లలో ఒక్కటి కూడా ఆడలేదు. అయితే తాజాగా ఆయన ఫిట్‌నెస్‌పై సీఎస్కే యాజమాన్యానికి చెందిన ఓ ఉన్నతస్థాయి ప్రతినిధి కీలక విషయాలను వెల్లడించారు. ధోనీ ప్రస్తుతం నెట్స్‌లో వికెట్ కీపింగ్, బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ తన పనిభారాన్ని పెంచుకుంటున్నారని జట్టు యాజమాన్యం పేర్కొంది. "ధోనీ తన రీ-ఎంట్రీ కోసం చాలా కష్టపడుతున్నారు. ఆయన శిక్షణపై పూర్తి దృష్టి సారించారు. అయితే ఆయన ఎప్పుడు మ్యాచ్ ఆడతారనేది మాత్రం ఎవరికీ తెలియదు. అది పూర్తిగా ధోనీ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది" అని సీఎస్కే ప్రతినిధి స్పష్టం చేశారు. ఫ్రాంచైజీ యజమాన్యం కూడా ధోనీపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని.. ఆయన సిద్ధంగా ఉన్నానని చెబితేనే బరిలోకి దిగుతారని సమాచారం.



## పాండ్యాపై వేటేశారా?

ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై వేటు పడిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో వాంఖడే వేదికగా జరుగుతున్న మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా చివరి నిమిషంలో దూరమయ్యాడు. అనారోగ్యంతో హార్దిక్ పాండ్యా ఆడటం లేదని తాత్కలిక సారథి సూర్యకుమార్ యాదవ్ చెప్పినా.. అభిమానులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. వరుస వైఫల్యాల నేపథ్యంలోనే హార్దిక్ పాండ్యాను తప్పించి సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారని ఆరోపిస్తున్నారు. అనారోగ్యం అనే సాకుతో పక్కన కూర్చోబెట్టారని కామెంట్ చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడిన ముంబై ఇండియన్స్ 7 పరాజయాలతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. హార్దిక్ పాండ్యా చెత్త కెప్టెన్సీ కారణంగానే ముంబై ఇండియన్స్ వరుస పరాజయాలను ఎదుర్కొందని ఆ జట్టు ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. కెప్టెన్సీతో పాటు ఆల్‌రౌండర్‌గానూ హార్దిక్ పాండ్యా విఫలమయ్యాడని, జట్టుకు భారంగా మారడంతోనే పక్కన కూర్చోబెట్టారని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రియురాలు మహికా శర్మతో హార్దిక్ పాండ్యా అతిగా ప్రవర్తిస్తున్నాడని, ఈ



వ్యవహారం ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్‌కు కూడా నచ్చలేదని కామెంట్ చేస్తున్నారు. ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ ఫిర్యాదుతోనే బీసీసీఐ గర్ల్‌ఫ్రెండ్స్ అనుమతిపై ఆంక్షలు విధించేందుకు సిద్ధమైందని అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా హార్దిక్ పాండ్యాపై సొంత జట్టు అభిమానులే కోపంగా ఉన్నారు.



## ఐపీఎల్ బోర్ కొడుతోంది!

**భారీగా పడిపోయిన వ్యూయర్ షిప్**

ఐపీఎల్ 2026 సీజన్ ట్రెండ్ అనూహ్యంగా పడిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐపీఎల్‌కు ప్రజాదరణ కరువైంది. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి ఫ్యాన్ బేస్ కలిగిన టీమ్స్ చతికిలపడటం.. మహేంద్ర సింగ్ ధోనీ ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం.. వన్ సైడ్ మ్యాచ్‌లతో లీగ్ బోరింగ్‌గా సాగుతుండటంతో జనాలు ఐపీఎల్‌ను లైట్ తీస్కుంటున్నారు. ఇప్పటికే ఈ టోర్నీలో ముప్పావు వంతు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. లీగ్ అత్యంత కీలకమైన దశకు చేరుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఐపీఎల్ క్రేజ్ అమాంతం పెరగాలి. సోషల్ మీడియా వేదికగా ఐపీఎల్ గురించే చర్చ జరగాలి. కానీ ఐపీఎల్ 2026ను జనాలు పట్టించుకోవడం మానేసారు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగడం కూడా ఐపీఎల్ క్రేజ్‌ను తగ్గించింది. సోమవారమే ఫలితాలు వెలవడటంతో దేశం మొత్తం వీటి గురించే చర్చ జరుగుతుంది. ఈ ఎన్నికల నేపథ్యంలోనే గత వారం రోజులుగా ఐపీఎల్ ప్రేక్షకాదరణ పడిపోతు వచ్చింది. టీవీ వ్యూయర్‌షిప్‌తో పాటు జియో హాట్‌స్టార్ వ్యూస్ కూడా దారుణంగా పడిపోయాయి. ఐపీఎల్‌కు సంబంధించిన వార్తలను కూడా జనాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇది బ్రాడ్‌కాస్టర్స్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఐపీఎల్ 2026 టీవీ రేటింగ్స్ 4.57 నుంచి 3.71కు పడిపోయిందని ఓ నివేదిక పేర్కొంది. సగటు వ్యూయర్‌షిప్‌తో పాటు టోటల్ రీచ్ కూడా దారుణంగా పడిపోయిందని వెల్లడించింది. దాంతో అడ్వర్టైజ్‌మెంట్స్ కూడా 65 నుంచి 45కు తగ్గించారని స్పష్టం చేసింది. ఈ ట్రెండ్ ఇలానే కొనసాగితే బ్రాడ్‌కాస్టర్స్ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్ తీవ్రంగా నష్టపోనున్నాయి. అదే జరిగితే ఐపీఎల్ లీగ్‌కే తీవ్ర నష్టం జరగనుంది. ముఖ్యంగా వన్‌సైడ్ మ్యాచ్‌లు జనాలకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి. ఇప్పటి వరకు 46 మ్యాచ్‌లు జరగ్గా.. ఇందులో రెండు, మూడు మినహా అన్నీ మ్యాచ్‌లు ఏకపక్షంగా ముగిసాయి. 264 పరుగుల రికార్డ్ లక్ష్యాన్ని కూడా పంజాబ్ కింగ్స్ ఎలాంటి కష్టం లేకుండా ఛేదించింది. ఈ 46 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క సూపర్ ఓవర్ మ్యాచ్ జరిగిందంటే.. లీగ్ ఎంత ఏకపక్షంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లతో మ్యాచ్‌లు బోరింగ్‌గా మారాయి.



## 'గర్ల్‌ఫ్రెండ్ కల్చర్'కు చెక్

**బీసీసీఐ కీలక నిర్ణయం**

ఐపీఎల్ 2026 సీజన్లో ఆటగాళ్ల వ్యక్తిగత ప్రవర్తనపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా, ఇషాన్ కిషన్, యశస్వి జైస్వాల్, అర్ష్‌దీప్ సింగ్ వంటి స్టార్ ప్లేయర్లు తమ గర్ల్‌ఫ్రెండ్స్‌తో కలిసి బహిరంగంగా తిరగడం, టీమ్ బస్సుల్లో ప్రయాణించడం, టీమ్ హోటళ్లలో వారితో కలిసి ఉండటంపై బోర్డు సీరియస్ అయింది. ఈ 'గర్ల్‌ఫ్రెండ్ కల్చర్' వల్ల భవిష్యత్తులో లీగ్ ప్రతిష్టకు భంగం కలిగే అవకాశం ఉందని భావిస్తున్న బీసీసీఐ.. దీనిని అరికట్టేందుకు కఠిన నిబంధనలను రూపొందిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొంతమంది ఆటగాళ్ల భాగస్వాములు సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉన్న 'ఇన్‌ఫ్లుయెన్సర్లు' కావడమే బోర్డు ఆందోళనకు ప్రధాన కారణం. గతంలో వీరిలో కొందరు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఆటగాళ్లకు, వారి భాగస్వాములకు మధ్య తలెత్తే వివాదాలు పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లడం వల్ల బోర్డు ప్రతిష్ట దెబ్బతింటోందని అధికారులు భావిస్తున్నారు. "టీమ్ బస్సులు గర్ల్‌ఫ్రెండ్స్ కోసం వేచి చూడటం, వారు ఆటగాళ్లతో కలిసి హోటళ్లలో ఉండటం ఆమోదయోగ్యం కాదు" అని ఓ ఉన్నత స్థాయి బీసీసీఐ అధికారి మండిపడ్డారు. నిజానికి బీసీసీఐ నిబంధనల ప్రకారం.. కేవలం ఆటగాళ్ల భార్యలు, కుటుంబ సభ్యులకు మాత్రమే నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం అనుమతి ఉంటుంది. అయితే 'అఫీషియల్ గర్ల్‌ఫ్రెండ్స్' పేరుతో యాంటీ కరప్షన్ యూనిట్ అధికారులు వీరికి ఎలా అనుమతి ఇస్తున్నారనే అంశంపై విచారణ చేపట్టాలని బోర్డు నిర్ణయించింది. కొంతమంది ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆటగాళ్ల దగ్గర ఉండటం వల్ల జట్టుకు సంబంధించిన కీలక సమాచారం లీక్ అయ్యే ప్రమాదం ఉందని.. అది క్రీడల సమగ్రతను దెబ్బతీస్తుందని బోర్డు భయపడుతోంది. త్వరలో జరగనున్న బీసీసీఐ సమావేశంలో ఈ 'గర్ల్‌ఫ్రెండ్ కల్చర్'పై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయనున్నారు. ఈ నిబంధనలు కేవలం ఐపీఎల్‌కే కాకుండా భారత జాతీయ జట్టు విదేశీ పర్యటనలకు కూడా వర్తిస్తాయని సమాచారం.

ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 5-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# హిందూ ఓటు బ్యాంకు సెగ

భారత రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. ఒకప్పుడు కేవలం కుల సమీకరణాలు, ప్రాంతీయ సెంటిమెంట్లపై ఆధారపడిన రాజకీయాలు ఇప్పుడు 'ధర్మం', 'సంస్కృతి' చుట్టూ తిరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, తమిళనాడులో ఎంకే స్టాలిన్, కేరళలో పినరయి విజయన్, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ వంటి ఉద్దండుల ఓటమికి వారు అనుసరించిన 'హిందూ వ్యతిరేక' ధోరణే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం మొదటి నుంచీ సనాతన ధర్మంపై విమర్శలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా ఉదయనిధి స్టాలిన్ వంటి నేతలు సనాతన ధర్మాన్ని ఒక వ్యాధితో పోల్చడం సామాన్య హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచింది. ద్రవిడ సిద్ధాంతం పేరుతో హిందూ పండుగలను, ఆచారాలను తక్కువ చేసి చూపడం ఆ పార్టీకి గ్రామీణ ఓటర్లలో ప్రతికూలతను తెచ్చిపెట్టింది. భక్తిని, రాజకీయాలను వేరుగా చూడలేని భారతీయ సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలు ఆత్మఘాతుకమే అవుతాయి. కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ ప్రభుత్వం శబరిమల వంటి సున్నితమైన అంశాలలో వ్యవహరించిన తీరు ఇంకా ప్రజల మదిలో సజీవంగానే ఉంది. కమ్యూనిస్టు భావజాలం పేరుతో సంప్రదాయాలను కాలరాయాలని చూడటం, హిందూ సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించడం విజయన్ పతనానికి నాంది పలికింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పరిస్థితి భిన్నమైనదేమీ కాదు. జై శ్రీరామ్ నినాదం వింటేనే అసహనం ప్రదర్శించడం, దుర్గా పూజ విగ్రహాల నిమజ్జనంపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు ఆమెకు 'హిందూ వ్యతిరేక' ముద్రను స్థిరం చేశాయి. మైనారిటీ ఓట్ల కోసం మెజారిటీ వర్గాన్ని దూరం చేసుకోవడం రాజకీయంగా ఎంత ప్రమాదకరమో బెంగాల్ ఫలితాలు నిరూపించాయి. సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు హిందూ మహిళల్లో భద్రతా భావాన్ని కలిగించాయి, ఇది మమత ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసింది, ఈ ముగ్గురు నేతల ఓటమి వెనుక ఉన్న ఉమ్మడి అంశం 'సాంస్కృతిక విస్మరణ'. సెక్యులరిజం అంటే కేవలం ఒక వర్గాన్ని ప్రసన్నం చేసుకోవడం కాదు, అందరి నమ్మకాలను గౌరవించడం. ఈ కనీస సూత్రాన్ని విస్మరించి, హిందూ సెంటిమెంట్‌ను తక్కువ అంచనా వేయడం వల్లే వీరు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. హిందూ ఓటు బ్యాంకును నిర్లక్ష్యం చేస్తే అధికారానికి దూరం కావాల్సిందేననే బలమైన సందేశాన్ని ఈ ఫలితాలు ఇచ్చాయి. ఇకనైనా ప్రాంతీయ పార్టీలు తమ వ్యూహాలను మార్చుకోకపోతే చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

# గోడలపై రాత.. అసలైన భావ మాధ్యమం



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

**గోడలపై రాతలు – సమాజ ప్రతిబింబం భావ వ్యక్తీకరణకు అద్దం. గోడలపై రాతలు అనేవి కేవలం రంగు పూసిన పదాలు కాదు సమాజ ఆలోచనలకు ప్రతిబింబంగా నిలిచే జీవ చరిత్ర. పురాతన కాలం నుంచే మనుషులు గోడలను తమ భావాలను తెలియజేసే మాధ్యమంగా ఉపయోగించుకున్నారు. గుహా చిత్రాల రూపంలో మొదలైన ఈ ప్రక్రియ ఆధునిక కాలంలో నినాదాల రూపంలో మారింది. ప్రతి గోడ ఒక కథ చెబుతుంది ప్రతి వాక్యం ఒక ఆవేదనను తెలియజేస్తుంది. రాజకీయ ఉద్యమాలు గోడలపై నినాదాల ద్వారానే ప్రజల్లో చైతన్యం కలిగించాయి. సామాజిక అన్యాయాలపై నిరసన తెలపడానికి గోడలే మొదటి వేదికగా మారాయి.**




యువత తమ ఆశయాలను స్పష్టంగా ప్రకటించేందుకు గోడలపై వ్రాతలను ఆయుధంగా మార్చుకున్నారు. ప్రేమ భావాలు కూడా చాలాసార్లు గోడలపై అక్షరాలుగా దర్శనమిస్తాయి. కొన్ని సందర్భాల్లో అవి కళాత్మక గ్రాఫిటీ రూపంలో నగరాలను అందంగా తీర్చిదిద్దుతాయి. అయితే కొన్ని సందర్భాల్లో అవి అశ్రద్ధగా రాసిన పదాలతో నగర శుభ్రతను దెబ్బతీస్తాయి. ప్రభుత్వాలు గోడలపై అనుమతి లేకుండా వ్రాయడాన్ని నిషేధించే చర్యలు చేపడుతున్నాయి. అయినా కూడా ఈ ప్రక్రియ పూర్తిగా ఆగిపోలేదు ఎందుకంటే భావ వ్యక్తీకరణను అడ్డుకోవడం కష్టం. గోడలు మౌనంగా ఉన్నా వాటిపై వ్రాయబడిన పదాలు గొంతుకగా మారుతాయి. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తన అభిప్రాయం చెప్పే హక్కు ఉంది అని అవి గుర్తు చేస్తాయి. గోడలపై రాతలు ఒక కాలానికి సంబంధించిన రాజకీయ పరిస్థితులను తెలియజేస్తాయి. అవి చరిత్రకారులకు భవిష్యత్తులో అధ్యయనం చేసే ఆధారాలుగా నిలుస్తాయి. కొన్ని నినాదాలు తరాలపాటు ప్రజల మదిలో నిలిచిపోతాయి. గోడలపై రాతలు ఒక వ్యక్తి ఆలోచనలను సమాజానికి చేరవేస్తాయి. అవి సమాజంలోని అసమానతలను బయటపెడతాయి. ఇలా గోడలపై రాతలు ఒక సామాజిక అద్దంగా నిలుస్తాయి. గోడలపై వ్రాతల ప్రభావం సానుకూలంగా ఉండగలదు ప్రతికూలంగా కూడా మారగలదు. సానుకూలంగా చూస్తే అవి ప్రజల్లో చైతన్యం పెంచే శక్తిని కలిగి ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ గురించి సందేశాలు గోడలపై కనిపించినప్పుడు అవి ప్రజలను ఆలోచింపజేస్తాయి. స్వచ్ఛతపై నినాదాలు నగరాలను శుభ్రంగా ఉంచే బాధ్యతను గుర్తు చేస్తాయి. విద్య ప్రాముఖ్యతను తెలియజేసే వాక్యాలు పిల్లల్లో ప్రేరణను కలిగిస్తాయి. అయితే ప్రతికూలంగా చూస్తే అశ్లీల పదాలు సమాజంపై చెడు ప్రభావం చూపుతాయి. అనధికార ప్రకటనలు గోడలను అసహ్యంగా మారుస్తాయి. సాంస్కృతిక విలువలను దెబ్బతీసే పదాలు సామాజిక వాతావరణాన్ని కలుషితం చేస్తాయి. కాబట్టి గోడలపై వ్రాతల వినియోగంలో బాధ్యత అవసరం. ప్రభుత్వం ప్రత్యేక స్థలాలను కేటాయించి అక్కడే వ్రాయడానికి అవకాశం కల్పించాలి. అలా చేస్తే కళాత్మకత పెరుగుతుంది నగర సౌందర్యం కాపాడబడుతుంది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు బాధ్యతాయుత భావ వ్యక్తీకరణపై అవగాహన కల్పించాలి. గ్రాఫిటీని కళగా అభివృద్ధి చేస్తే యువతకు సృజనాత్మక వేదిక లభిస్తుంది. గోడలపై రాతలు ఒక శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనం అని గుర్తించాలి. అది సమాజాన్ని మార్చే శక్తిగా ఉపయోగపడాలి. ప్రతి వాక్యం ఒక విలువను ప్రతిబింబించేలా ఉండాలి. సృజనాత్మకతతో కూడిన సందేశాలు సమాజానికి దారిదీపంగా నిలుస్తాయి. అవివేకంగా రాసిన పదాలు మాత్రం సమాజాన్ని వెనక్కి లాగుతాయి. కాబట్టి గోడలపై రాతలు బాధ్యతతో కూడిన భావ ప్రకటనగా మారాలి. అప్పుడు మాత్రమే అవి నిజమైన అర్థంలో సమాజ అభివృద్ధికి దోహదపడతాయి. (అంచనా గణాంకాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో సుమారు 65% గోడలు ఏదో ఒక రూపంలో రాతలతో కనిపిస్తాయి, గ్రామీణ ప్రాంతాల్లో ఇది సుమారు 38% వరకు ఉంటుంది, ప్రజల్లో గోడలపై సందేశాలను గమనించి ప్రభావితమయ్యే వారి శాతం సుమారు 52% గా పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.)

గోడలపై రాతలు కాలానుగుణంగా మారుతూ సమాజపు స్పందనలను సజీవంగా ప్రతిబింబించే అరుదైన పత్రాలుగా నిలుస్తున్నాయి. ఒక ప్రాంతంలో కనిపించే నినాదాలు అక్కడి ప్రజల సమస్యలు ఆశయాలు అభిలాషలను స్పష్టంగా తెలియజేస్తాయి. ఎన్నికల సమయాల్లో గోడలు రాజకీయ ప్రచారానికి కేంద్రబిందువులుగా మారుతాయి, అదే గోడలు విద్యా ప్రచారానికి వేదికలుగా కూడా ఉపయోగించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యలు నీటి కొరత పంటల నష్టాలపై గోడలపై రాసిన వాక్యాలు బాధను వెలిబుచ్చుతాయి. పట్టణాల్లో ఉద్యోగ అవకాశాలు విద్యా సంస్థల ప్రకటనలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ విధంగా గోడలపై రాతలు ప్రాంతానుసారంగా విభిన్న రూపాలు సంతరించుకుంటాయి. కొన్ని సందర్భాల్లో ఇవి కళాత్మక చిత్రలేఖనంతో కలిసి ప్రజలకు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఆధునిక నగరాల్లో గ్రాఫిటీ కళ యువతకు ఒక ప్రత్యేక గుర్తింపుగా మారింది. ఇది కేవలం గోడలపై వ్రాయడం మాత్రమే కాదు ఒక భావప్రపంచాన్ని చిత్రాల ద్వారా వ్యక్తపరచడం. ప్రపంచంలోని పలు నగరాలు గ్రాఫిటీ కళకు ప్రత్యేక స్థానం కల్పించాయి, దాంతో నగరాల అందం పెరిగింది. అయితే నియంత్రణ లేకుండా జరిగే రాతలు సామాజిక సమస్యలకు దారి తీస్తాయి. ముఖ్యంగా చారిత్రక కట్టడాలపై వ్రాయడం వారసత్వాన్ని నాశనం చేస్తుంది. పర్యాటక ప్రదేశాల్లో కనిపించే అజాగ్రత్త రాతలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి. అందుకే గోడలపై రాతల విషయంలో కఠిన నియంత్రణ అవసరం. ఒకవైపు స్వేచ్ఛను కాపాడుతూ మరోవైపు శుభ్రతను పరిరక్షించే విధానాలు అవసరం. పౌరులలో బాధ్యత పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాలలలోనే పిల్లలకు సామాజిక బాధ్యత గురించి బోధిస్తే భవిష్యత్తులో మంచి మార్పు కనిపిస్తుంది. కళాత్మక గ్రాఫిటీకి ప్రోత్సాహం ఇస్తూ అనధికార వ్రాతలను నిరోధించడం సమతుల్య మార్గం. మీడియా కూడా ఈ అంశంపై చైతన్యం కలిగించే పాత్ర పోషించాలి. గోడలపై రాతలు ఒక సామాజిక చర్చకు దారి తీసే శక్తిని కలిగి ఉన్నాయి. ప్రజలు వాటిని చదివి స్పందిస్తారు ఆలోచిస్తారు. కొన్ని నినాదాలు ఉద్యమాలకు నాంది పలికిన ఉదాహరణలు ఉన్నాయి. స్వాతంత్ర్య పోరాట కాలంలో గోడలపై రాసిన నినాదాలు ప్రజల్లో దేశభక్తిని రగిలించాయి. ఆ స్ఫూర్తి నేటికీ కొనసాగుతోంది. ఆధునిక కాలంలో డిజిటల్ మీడియా విస్తరించినా గోడలపై వ్రాతల ప్రాముఖ్యత తగ్గలేదు. ఎందుకంటే అవి నేరుగా ప్రజల కళ్ల ముందే కనిపిస్తాయి. ఇంటర్నెట్ లేని ప్రాంతాల్లో కూడా ఇవి సమాచార మాధ్యమంగా పనిచేస్తాయి. ఈ నేపథ్యంలో గోడలపై వ్రాతలను సరైన దిశలో వినియోగించడం సమాజానికి మేలు చేస్తుంది. ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి గోడలను పరిరక్షించాలి. అనుమతి ఉన్న చోట్ల మాత్రమే వ్రాయడం అలవాటు చేసుకోవాలి. ప్రభుత్వ సంస్థలు కళాకారులకు ప్రత్యేక స్థలాలు కేటాయిస్తే సృజనాత్మకత పెరుగుతుంది. నగరాల అందం కూడా కాపాడబడుతుంది. గోడలపై రాతలు ఒక సాంస్కృతిక ప్రకటనగా మారే అవకాశం ఉంది. వాటి ద్వారా ప్రాంతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించవచ్చు. పండుగల సందర్భంలో గోడలపై అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. విద్యార్థులు కూడా సామాజిక సందేశాలను చిత్రాల రూపంలో వ్యక్తపరచగలరు. ఇది వారికి సామాజిక అవగాహన పెంచుతుంది. చివరగా గోడలపై రాతలు ఒక సమాజాన్ని అర్థం చేసుకునే కిటికీగా నిలుస్తాయి. వాటిని బాధ్యతతో వినియోగిస్తే అవి అభివృద్ధికి దోహదపడతాయి లేకపోతే అవి సమస్యలకు కారణమవుతాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ గోడలపై వ్రాతల విలువను గుర్తించి వాటిని సానుకూల దిశలో మలచాలి. అప్పుడు గోడలు కేవలం ఇటుకల సముదాయం కాకుండా ఆలోచనల వేదికలుగా మారుతాయి. (అంచనాల ప్రకారం ఎన్నికల సమయంలో గోడలపై రాజకీయ రాతలు సుమారు 72% వరకు పెరుగుతాయి, ప్రజల్లో వాటిని చూసి ఓటింగ్ నిర్ణయంపై ప్రభావం పొందేవారు సుమారు 41% వరకు ఉంటారని పరిశీలనలు సూచిస్తున్నాయి)

గోడలపై వ్రాతల ప్రస్థానం చివరికి ఒక ముఖ్యమైన సందేశాన్ని మన ముందుంచుతుంది అది బాధ్యతతో కూడిన స్వేచ్ఛ విలువ. సమాజంలో ప్రతి వ్యక్తికి తన భావాలను వ్యక్తపరచే హక్కు ఉన్నప్పటికీ ఆ హక్కు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వినియోగించబడాలి. గోడలు ప్రజలందరికీ చెందే సామూహిక ఆస్తి కావడంతో వాటి పరిరక్షణ ప్రతి పౌరుడి కర్తవ్యంగా భావించాలి. ఒక చిన్న వాక్యం కూడా పెద్ద మార్పుకు నాంది పలకగలదనే విషయం గోడలపై వ్రాతల చరిత్ర చెబుతోంది. అందుకే వాటిని నిర్లక్ష్యంగా తీసుకోవడం సరైన దారి కాదు. సమాజంలో మార్పు కోరుకునే వారు తమ సందేశాలను స్పష్టంగా సృజనాత్మకంగా ప్రజలకు చేరవేయాలి. అప్పుడు మాత్రమే ఆ వాక్యాలు మనసులను తాకగలవు. గోడలపై రాతలు కేవలం అక్షరాల సమాహారం కాదు అవి ఒక భావోద్వేగ ప్రవాహం ఒక ఆలోచనా దిశ ఒక సామాజిక స్పందన. ఈ అంశాన్ని గుర్తించినప్పుడు వాటి విలువ మరింత పెరుగుతుంది. ఇప్పటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరించినా గోడల ప్రాముఖ్యత తగ్గలేదు. డిజిటల్ మాధ్యమాలు వేగంగా సమాచారాన్ని చేరవేసినా గోడలపై రాతలు ప్రత్యక్ష అనుభూతిని కలిగిస్తాయి. ఒక వ్యక్తి నడుస్తూ గోడపై చూసే వాక్యం అతని ఆలోచనలను వెంటనే ప్రభావితం చేయగలదు. అందుకే ప్రభుత్వాలు కూడా ప్రజా అవగాహన కార్యక్రమాలలో గోడలను వినియోగిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ పరిశుభ్రత విద్య వంటి అంశాలపై గోడలపై రాసే సందేశాలు ప్రజలకు ఉపయోగకరంగా మారుతున్నాయి. ఈ విధానం గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఫలితాలను ఇస్తోంది. ఎందుకంటే అక్కడ ఇతర మాధ్యమాల ప్రాప్తి తక్కువగా ఉంటుంది. గోడలపై రాతలు అక్కడ ఒక జీవ మాధ్యమంగా పనిచేస్తాయి. (సర్వేల ప్రకారం ప్రజల్లో సుమారు 58% మంది కనీసం ఒకసారి గోడలపై ఉన్న ప్రజా సందేశాల వల్ల ప్రవర్తనలో మార్పు చేసుకున్నట్లు గుర్తించారు. అయితే గోడల వినియోగంలో నియంత్రణ లేకపోతే అది సమస్యలకు దారి తీస్తుంది. అనధికార ప్రకటనలు అశ్లీల పదాలు రాజకీయ ద్వేషపూరిత నినాదాలు సామాజిక విభేదాలను పెంచే ప్రమాదం కలిగి ఉంటాయి. కాబట్టి చట్టపరమైన నియమాలను కఠినంగా అమలు చేయాలి. అదే సమయంలో కళాత్మక వ్యక్తీకరణకు ప్రోత్సాహం ఇవ్వాలి. నగరాల్లో ప్రత్యేక గ్రాఫిటీ జోన్లు ఏర్పాటు చేయడం ఒక మంచి ఆలోచనగా మారుతోంది. అక్కడ కళాకారులు తమ ప్రతిభను చూపించగలరు సమాజం కూడా అందాన్ని ఆస్వాదించగలదు. ఈ విధానం గోడలపై అశ్రద్ధ వ్రాతలను తగ్గించడంలో సహాయపడుతుంది.

విద్యాసంస్థలు ఈ అంశంలో కీలక పాత్ర పోషించగలవు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పౌర బాధ్యతపై అవగాహన కల్పించాలి. గోడలపై వ్రాతల ద్వారా సానుకూల సందేశాలను ఎలా ఇవ్వాలో వారికి నేర్పాలి. పోటీలు వర్క్‌షాప్‌లు నిర్వహించడం ద్వారా యువతలో సృజనాత్మకత పెంపొందించవచ్చు. ఈ విధంగా వారు తమ భావాలను సమాజానికి ఉపయోగపడే విధంగా వ్యక్తపరచడం నేర్చుకుంటారు. ఇది భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుంది. గోడలపై రాతలు సాంస్కృతిక పరిరక్షణలో కూడా ఒక పాత్ర పోషించగలవు. ప్రాంతీయ కళారూపాలు సంప్రదాయాలను గోడలపై చిత్రాల రూపంలో ప్రతిబింబిస్తే అవి తరతరాలకు అందుతాయి. పండుగల సందర్భంలో గోడల అలంకరణలు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇది స్థానిక కళాకారులకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుంది. సమాజం మొత్తం కలిసి ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అయితే గోడలు ఒక సాంస్కృతిక వేదికగా మారతాయి. ముగింపుగా చెప్పాలంటే గోడలపై రాతలు ఒక శక్తివంతమైన సామాజిక సాధనం. వాటిని ఎలా వినియోగిస్తామన్నదే వాటి ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. బాధ్యతతో కూడిన భావ వ్యక్తీకరణ సమాజాన్ని ముందుకు తీసుకెళ్తుంది నిర్లక్ష్యంతో చేసిన రాతలు వెనక్కి నెడతాయి. ప్రతి వ్యక్తి తన పాత్రను గుర్తించి గోడలను గౌరవించాలి. అనుమతి ఉన్న చోట్ల మాత్రమే వ్రాయడం ఒక మంచి అలవాటు కావాలి. సృజనాత్మకతతో కూడిన సందేశాలు సమాజానికి మార్గదర్శకంగా నిలవాలి. అప్పుడు గోడలు నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ వాటిపై వ్రాసిన ప్రతి పదం ఒక గొంతుకగా మారి సమాజాన్ని సానుకూల దిశలో నడిపిస్తుంది. (మొత్తం మీద గోడలపై వ్రాతలను గమనించే ప్రజల్లో సుమారు 52% మంది వాటి ద్వారా ఆలోచనాత్మక ప్రభావాన్ని అనుభవిస్తున్నారని సామాజిక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!
పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.